
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మెదక్

20

బుధవారం 4 జనవరి 2018



సన్న బియ్యం..
బడా మోసం

5

కేంద్ర ప్రభుత్వం బియ్యం అమ్మకాలపై జీఎస్టీని పూర్తిగా తొలగించింది. ఎలాంటి పన్నులూ లేవన్నమాట. అయితే ధరలు తగ్గాలి కానీ చిత్రంగా పెరుగుతున్నాయి. రెండు, మూడు నెలల్లో సన్నరకం బియ్యం ధర క్వింటాల్‌కు సుమారు రూ.800 నుంచి రూ.1000 వరకు పెరిగింది. ఇందులో ప్రభుత్వానికి నయా పైసా కూడా చెల్లించడం లేదు. పైగా వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి ధరలను పెంచేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

జీఎస్టీ ఎత్తివేసినా
పెరిగిన ధరలు

తగ్గాల్సిన చోట అధికమవుతున్న రేట్లు

జిల్లాలో వినియోగదారులపై రూ.కోట్లలో భారం

ఇష్టారాజ్యంగా దోచుకుంటున్న వ్యాపారులు

పట్టించుకోని ప్రభుత్వ శాఖలు

విద్యుద్దీకరణ పనులు
వేగవంతం చేయాలి

- భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా లైన్లను విస్తరించాలి
- రూ.పది కోట్లు మంజూరైనా అలసత్వం దేనికి ?
- నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవు
- పరిశుభ్రత అందరి బాధ్యత
- స్వచ్ఛ సర్వేక్షన్‌లో కేంద్ర అవార్డును సాధిద్దాం
- ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి

5



చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ తదితరులు

నకిలీ ఎరువుల బాగోతం
బట్టబయలు

- తేదీ, లాట్ నంబర్ లేకుండా అమ్మకం
- ముఠాను పట్టుకున్న మిన్‌పూర్ గ్రామస్థులు
- అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు
- పోలీసుల అదుపులో విక్రయదారులు
- అనుమతులు లేకుండా అమ్మడం నేరం
– వ్యవసాయాధికారి ప్రతాప్

3



బ్యాగుపై రసాయన పోషక ఎరువుల మోతాదు వివరాలు లేని పట్టిక

నేడు నిజాంసాగర్‌కు సింగూరు జలాలు

- 4 టీఎంసీల నీటి విడుదలకు ఉత్తర్వులు
- దశల వారీగా 0.35 టీఎంసీలు

4లో

ఉద్యోగ పర్వం

పాత పెన్షన్ విధానమే కావాలి

- టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకట్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 3:



నూతన విధానం పెన్షన్ ఎప్పుడు ప్రారంభించారు..?

2004 సెప్టెంబర్ 1న ఈ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆనాటి నుంచి విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరికీ ఈ విధానం వర్తిస్తుంది.

ప్రభుత్వం ఈ విధానం ఎలా అమలు చేస్తోంది.?

ఈ విధానంలో ప్రతీ ఉద్యోగి వేతనం నుంచి నెలనెలా పది శాతం నిధిని కోత విధిస్తుంది. ఈ నిధికి ప్రభుత్వం పది శాతం కలుపుతోంది. ఈ మొత్తాన్ని షేర్ రూపంలో ఇన్వెస్ట్ చేస్తుంది.

సీపీఎస్‌తో జరిగే నష్టమేంటి..?

స్టాక్ మార్కెట్ లావాదేవీలపై ఆధారపడి ఉంటుంది. దీంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతోంది.

ఈ విధానానికి పాత పెన్షన్ విధానానికి మార్పులేమిటి?

సీపీఎస్ విధానంతో పదవీ విరమణ అనంతరం వచ్చే గ్రాట్యుటీ లేదు. మృతి చెందితే కూడా ఏమీ లేదు. పాత పెన్షన్ విధానంలో అయితే పదవీ విరమణ పొందిన ఉద్యోగికి చివరి నెల వేతనం ఎంత వస్తుందో.. అందులో సగం డబ్బు ఉద్యోగికి పెన్షన్ రూపంలో అందుతుంది. గ్రాట్యుటీ సుమారు రూ. 20 లక్షల వరకు వస్తుంది.

భక్తి

కోర్కెలు తీర్చే షిరిడీసాయిబాబా



జంబికుంటలో వెలసిన షిరిడీ సాయిబాబా

మెదక్ అర్బన్, జనవరి 3: జంబికుంటలో వెలసిన షిరిడిసాయిబాబా భక్తుల కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందాడు. చాలా ఏళ్లుగా కోరికలు తీరుస్తూ భక్తుల పూజలు అందుకుంటున్నాడు. బాబాను కొలిస్తే సకల లాభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే బాబా దర్శనానికి భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. 1989 సంవత్సరంలో దాతల సహకారంతో బాబా ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోంది. ఏటా గురు పౌర్ణమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహిస్తారు. ప్రతీ గురువారం అన్నదాన కార్యక్రమం చేపడుతారు. దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. అంతేకాకుండా విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయి.

నైపుణ్యానికి చోటేదీ..!

- ఆర్ట్, క్రాఫ్ట్ అభ్యర్థులకు డీఎస్సీలో మొండిచేయి
- 20 ఏళ్లుగా నియామకాలు లేవు
- పోస్టుల కోసం ఎదురుచూపు జిల్లాలో 230 మంది అభ్యర్థులు



డ్రాయింగ్‌పై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మెదక్ అర్బన్, జనవరి 3: ఆర్ట్, క్రాఫ్ట్ అభ్యర్థులకు డీఎస్సీలో మొండిచేయి ఎదురైంది. నోటిఫికేషన్లు రాక చేసిన కోర్సులకు సంబంధించి బయట ఏమి చేయలేక వయస్సు మీద పడుతున్నా వందలాది సంఖ్యలో పోస్టుల కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు విద్యార్థులకు చదువుతో పాటు కళలు, అన్ని రంగాల్లో నైపుణ్యాలు ఉండాలన్న ఉద్దేశంతో వంద మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, పీఈటీ టీచర్లను నియమించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి నుంచి పూర్తి స్థాయిలో అమలు లేకున్నా తూతూ మంత్రంగా సర్వ శిక్షా అభియాన్ కింద పార్ట్ టైం వర్కర్లుగా హైస్కూళ్లల్లో ఆర్ట్, క్రాఫ్ట్ పీఈటీలు విధులు నిర్వర్తిస్తున్నారు. పథకం తీరు ఎలా ఉన్నా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్య కోర్సులు ప్రవేశపెడుతామని హామీ ఇచ్చారు. రెగ్యులర్ పోస్టుల నియామకం చేపడుతున్నట్లు ప్రకటన చేయడంతో పదో తరగతి, ఇంటర్ చేసిన యువతీ, యువకులు ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, లోయర్, హయ్యర్, టీటీసీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేశారు. ఇటీవల టీపీపీఎస్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసి కోర్టు తీర్పుతో రద్దు చేసిన డీఎస్సీలో కూడా ఈ పోస్టుల జోలికి రాలేదు. గురుకుల పాఠశాలలో కొద్దిపాటి పోస్టులు వేశారు. ప్రస్తుతం నోటిఫికేషన్ రద్దయినా, తిరిగి వచ్చే నోటిఫికేషన్‌లోనైనా తమకు అవకాశం కల్పించాలని ఆర్ట్, క్రాఫ్ట్ అభ్యర్థులు కోరుతున్నారు.

20 ఏళ్లుగా నియామకాలు లేవు

ఆర్ట్, క్రాఫ్ట్ పోస్టులకు సంబంధించి సుమారు 20 ఏళ్లుగా ప్రభుత్వాలు నియామకాలు చేపట్టలేదు. అప్పట్లో టీటీసీ, ఇతర కోర్సులు చేసిన వారి వయస్సు దాటిపోగా ఈ మధ్యకాలంలో కోర్సులు చేసిన వారు కూడా వయస్సు పైబడుతుందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 230 మంది ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ అభ్యర్థులు ఉన్నారు. సీఎం ప్రకటనతో ఆశగా కోర్సులు పూర్తి చేస్తే ప్రయోజనం లేకుండా పోయిందని నిరుద్యోగులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం ఎస్ఎస్ఏ కింద ప్రభుత్వ పాఠశాలల్లో పార్ట్ టైం వర్కర్ల పేరుతో పనిచేస్తున్న కొంతమందికి కూడా చాలీచాలనీ వేతనం ఇప్పించి పార్ట్ టైం పేరుతో పూర్తి సమయం చేయించుకుంటున్నారని, వృత్తికి విలువ లేకుండా పోతోందని వారు ఆవేదన చెందుతున్నారు.

ప్రతీ ఏడాది పెరుగుతున్న పోటీ

గతంలో వృత్తి విద్య కోర్సులకు పోటీ తక్కువగా ఉండేది. గత నాలుగేళ్లుగా వందల మంది అభ్యర్థులు లోయర్, హయ్యర్, టీటీసీ, డిప్లొమా, ఐటీఐ, ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు ఉన్నారు. ప్రతీ ఏటా అభ్యర్థులు పెరగడంతో పాటు గతంలో నుంచి ఉన్న వారి సంఖ్య అధికంగా ఉంది.

వృత్తివిద్య కోర్సులను పాఠశాలల్లో పూర్తి స్థాయిలో అమలు చేసి పోస్టులు కల్పించాలని ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని వారు కోరుతున్నారు.

పోస్టుల కోసం ఎదురుచూస్తున్నాం



విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం ఉండాలనే ఉద్దేశంతో వంద మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్లను నియమించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తివిద్య కోర్సులు ప్రవేశపెడుతామని సీఎం హామీ ఇచ్చారు. నోటిఫికేషన్‌లో మొండిచేయి చూపడంతో మా పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఆశతో పోస్టుల కోసం ఎదురుచూస్తున్నా.

– బాలక్రిష్ణ, డ్రాయింగ్ టీచర్

డీఎస్సీలో అవకాశం కల్పించాలి



కళారంగంలో ప్రావీణ్యత ఉండడంతో ఆర్ట్‌లో లోయర్, హయ్యర్, టీటీసీ పూర్తి చేశా. చాలా ఏళ్లుగా నోటిఫికేషన్ పడలేదు. సర్వ శిక్షా అభియాన్‌లో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు వేయడంతో ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్నా. రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యోగాలు వస్తాయని ఆశతో ఎదురు చూసాం. ఇప్పుడైనా డీఎస్సీలో మాకు అవకాశం కల్పించాలి.

– రామాంజనేయచారి, ఆర్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

బతుకులు భారం

- సాంకేతికతతో పోటీ పడలేక ఇబ్బందులు
- దుర్భర జీవనం గడుపుతున్న నాయీబ్రాహ్మణులు



క్షౌర వృత్తి చేస్తున్న నాయీ బ్రాహ్మణుడు

మెదక్ అర్బన్, జనవరి 3: కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న నాయీబ్రాహ్మణుల బతుకులు దుర్భరంగా మారాయి. గ్రామ, పట్టణాల్లో ఆదాయం లేక.. సాంకేతికతతో పోటీ పడలేక ఆర్థికంగా ఎదగలేకపోతున్నారు. కులవృత్తిని వదులుకోలేక.. ఇతర ఉపాధి దొరకక ప్రస్తుతం వీరి పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కల తయారైంది. జిల్లాలోని 20 మండలాల్లో 1500లకు పైగా నాయీబ్రాహ్మణుల దుకాణాలు ఉన్నాయి. అందులో అత్యధికంగా మెదక్‌లో ఉన్నాయి. క్షౌరశాలలను అదే సామాజిక వర్గానికి చెందిన వారు నిర్వహిస్తుండడంతో పల్లెటూళ్లలో గతంలో బతుకులు సాఫీగా సాగేవి. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లను పంచుకొని ఏడాది పొడవునా వారి కుటుంబీకులకు క్షౌర వృత్తిని కొనసాగించేవారు. వీరిలో కొందరు నాయీబ్రాహ్మణుల భార్యలు పురుడు పోసేవారు. అందుకుగానూ ఆయా కుటుంబీకులు వ్యవసాయ పంట చేతికందగానే ఒకేసారి ధాన్యాన్ని ఇచ్చేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా దుకాణాలు వెలిసాయి. క్షౌరం చేసే పరికరాలన్నీ ఆధునీకతను అందిపుచ్చుకున్నాయి. ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉన్న వీరు సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో వెనుకబడడంతో ఉన్న పరికరాలతోనే సర్దుకుపోతున్నారు. ఈ క్రమంలో వీరికి వచ్చే ఆదాయం కూడా అతి తక్కువగా ఉంటుంది.

దెబ్బతీసిన హెచ్ఐవీ

హెచ్ఐవీ నాయీ బ్రాహ్మణ వృత్తిని బాగా దెబ్బతీసింది. హెచ్ఐవీ భయంతో సెలూన్ షాపుల్లో షేవింగ్ చేసుకునే వారి సంఖ్య క్రమేపీ తగ్గటంతో రాబడి తగ్గిపోయింది. అంతే కాక క్రాపింగ్‌లో వచ్చిన మార్పుల వల్ల తమ పరిస్థితి మరింత దారుణంగా తయారైందని నాయీ బ్రాహ్మణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



పదో తరగతి వరకు చదివి ఉద్యోగం రాక ఈ వృత్తిని ఎంచుకున్న, దీనిపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలి. ఆధునిక పరికరాలను రాయితీ ధరలకు అందించాలి.

–అడివయ్య, సంఘం జిల్లా అధ్యక్షుడు

ఉచితంగా స్థలం ఇవ్వాలి



వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న మాకు ఆదాయం అంతంతే. అందులో నుంచినెలకు రూ. 3 వేలు అద్దె చెల్లిస్తున్నాను. ప్రభుత్వం చొరవ తీసుకొని గ్రామ, పట్టణ ప్రాంతాల్లో దుకాణాలు నెలకొల్పేందుకు ఉచితంగా స్థలాన్ని కేటాయించాలి.

– లక్ష్మణ్, క్షౌర వృత్తిదారుడు

ఇవీ డిమాండ్లు

- ఫ్యాషన్ క్రాపింగ్‌పై శిక్షణ ఇవ్వాలి.
- ఆధునిక పరికరాలను రాయితీ ధరలకు ఇచ్చి సర్కారు ప్రోత్సహించాలి.
- సెలూన్లను ఏర్పాటు చేసుకునేలా పావలా వడ్డీ రుణాలు ఇవ్వాలి.
- పుణ్యక్షేత్రాల్లో క్షౌరం చేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.
- అర్హులైన వారికి డబుల్‌బెడ్‌రూంలు మంజూరు చేయాలి.
- లైసెన్స్ ఫీజు, యూజర్ చార్జీలు రద్దు చేయాలి.

నకిలీ ఎరువుల గుట్టు రట్టు







రైతులు కొనుగోలు చేసిన ఎరువుల బస్తా, గుళికలు, పిచికారీ మందులు, రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

- **మిన్‌పూర్ గ్రామంలో వెలుగు చూసిన వైనం**
- **అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు**
- **పోలీసుల అదుపులో విక్రయదారులు**

పాపన్నపేట, జనవరి 3: నకిలీ ఎరువుల గుట్టు రట్టయింది. తయారు చేసిన తేదీ, లాట్ నెంబరు లేకుండా శ్రీవిజయ బయో ఫెర్టిలైజర్ ఇండియా పేరుపై ఎరువులను, గుళికలను, పురుగుమందులను అమ్ముతున్న ముఠాను మిన్‌పూర్ గ్రామస్థులు పట్టుకున్నారు. పదిహేను రోజులుగా పాపన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో సదరు కంపెనీకి చెందిన వ్యక్తులు రైతుల వద్ద ముందుగా ఆర్డర్లు తీసుకొని ఎరువులను సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగానే మిన్‌పూర్‌లో కూడా జంగం రాజు, హన్మంత్ కిషన్, కర్రోళ్ల కృష్ణమూర్తి, మగ్రి సురేందర్‌రెడ్డి, అంతగోని మల్లయ్య, హన్మంత్‌పోలు, లస్మయ్య, దేవసుందరి, కాంతయ్యలకు సుమారు 70 సంచుల ఎరువులను అంటగట్టారు. ఒక్కో ఎరువుల బస్తా రూ.1000 కాగా, గుళికల బస్తాకు రూ.900 తీసుకొని అదనంగా ఒక లీటర్ స్ప్రే మందును ఇస్తున్నారు. గ్రామాలకు వచ్చిన కంపెనీ సేల్స్ మెన్స్ దోమకాటు రాకుండా ఈ మందులు ఉపయోగపడతాయని రైతులను నమ్మబలికారు. గత ఖరీఫ్‌లో దోమపోటుబారిన పడి భారీగా నష్టపోయిన రైతాంగం వారు మాటలు నమ్మి, చెప్పినంత ధరకు ఎరువులను కొనుగోలు చేశారు. అయితే మిగతా ఎరువులతో పాటు శ్రీ విజయ బయో ఫెర్టిలైజర్ కూడా పొలంలో వేసిన రైతులకు ఎరువు గుళికలు నీటిలో కరగకపోవడంతో అనుమానం వచ్చింది. బుధవారం తిరిగి ఎరువులు అమ్మడానికి గ్రామంలోకి వచ్చిన సెల్స్‌మెన్‌ను గ్రామ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బీస గోపాల్, టీఆర్‌ఎస్‌పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు మగ్రి లింగారెడ్డి, విశ్వకర్మ సంఘం పాపన్నపేట మండల అధ్యక్షుడు వడ్ల కుభేరుడు, మరికొంత మంది రైతులు నిలదీయడంతో పొంతనలేని సమాధానాలుఉ చెప్పాడు. దీంతో మరింత అనుమానాలకు తావివ్వడంతో అతడిని గ్రామపంచాయతీ వద్దకు తీసుకొచ్చి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. ఎంపీటీసీ కమ్మరి మంజుల వ్యవసాయశాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాపన్నపేట ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి ప్రతాప్‌కుమార్, ఏఈవోలు ప్రశాంత్, నెలవంక, ఏఎస్‌ఐ నర్సింలు, పోలీసులు అక్కడకు చేరుకొని ఎరువులను పరిశీలించారు. బస్తాలపై పోషకాల శాతం చూపే పట్టిక, లాట్‌నెంబరు, ఎక్స్పైరీ డేట్ లేకపోవడాన్ని గమనించారు. రైతులకు ఎరువులు, పురుగుమందులు అమ్మాలన్నా ఏవోల, ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఇవేమీ లేకుండానే సదరు కంపెనీ యథేచ్ఛగా సేల్స్ రిప్రజెంటేటివ్‌లను, సెల్స్‌మెన్లను పెట్టి బహిరంగంగా నకిలీ ఎరువుల అమ్మకానికి శ్రీకారం చుట్టింది. 15రోజులుగా ఒక్క మిన్‌పూర్‌లోనే కాకుండా మండల పరిధిలోని ఎల్లాపూర్, కుర్తివాడ, యూసూఫ్‌పేట, పొడ్చన్‌పల్లి తదితర గ్రామాల్లో ఎరువుల విక్రయాలు జరిగినట్లు సెల్స్‌మెన్లు తెలిపారు. ఎంపీటీసీ నుంచి, ఎరువులను కొన్న రైతుల నుంచి రాత పూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. వ్యవసాయాధికారి ప్రతాప్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం

– ఎస్‌ఐ సందీప్‌రెడ్డి

నకిలీ విత్తనాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సందీప్‌రెడ్డి పేర్కొన్నారు. మిన్‌పూర్ గ్రామంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు వ్యవసాయాధికారి ప్రతాప్‌కుమార్ ఫిర్యాదు చేశారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు కంపెనీ బాధ్యులతో మాట్లాడామని, పూర్తి అనుమతులు ఉన్నట్లు తెలిపారన్నారు. రేపటిలోగా ఆ కంపెనీ యాజమాన్యాన్ని ఆధారాలు చూపాలని ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆ ఆధారాల ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతులు లేకుండా అమ్మడం నేరం

– ఇన్‌చార్జి ఏవో ప్రతాప్‌కుమార్



అన్ని విధాల అనుమతులున్న కంపెనీలు కూడా వారు తయారు చేసిన ఎరువులను అమ్మాలంటే వ్యవసాయశాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి. మిన్‌పూర్ గ్రామస్థుల ఫిర్యాదు మేరకు తాము స్వాధీనం చేసుకున్న సాయిల్ కండీషనర్ శ్రీవిజయ బయో ఫెర్టిలైజర్ ఇండియా ప్రైవేట్ కంపెనీ వారు విరాత్ అనే పేరుపై అమ్ముతున్న ఎరువుల బస్తాలపై పూర్తి అనుమానాలున్నాయి. బస్తాపై రసాయనిక, పోషక విలువల మోతాదు పట్టీ, లాట్ నెంబరు, తయారీ తేదీ లేకపోవడంపై ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశాం. రైతులకు న్యాయం చేస్తాం.

న్యాయం చేయండి

- **డిప్యూటీ సీఎం, విద్యాశాఖ కమిషనర్లకు టీచర్ మొర**

ఖైరతాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తనతో అనుచితంగా ప్రవర్తించిన వారిపై కేసులు పెట్టగా అవి విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి తెచ్చినా వినడం లేదంటూ అకారణంగా తనపై సస్పెన్షన్ వేటు వేసిన మెదక్ జిల్లా డీఈవోపై చర్యలు తీసుకోవాలని ఓ ప్రధానోపాధ్యాయురాలు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్‌కు మొరపెట్టుకున్నారు. ఆమె తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బానోతు కిషన్‌నాయక్‌తో కలిసి సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో, సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో కమిషనర్ కిషన్‌ను కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తూప్రాన్ మండలం అల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసిన తనపై అదే పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తించారని, లొంగదీసుకునేందుకు ప్రయత్నించి అనుచితంగా ప్రవర్తించడంతో డీఈవో సూచన మేరకే వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. అనంతరం స్థానికంగా రాజకీయ, ఆర్థిక పలుకుబడి ఉన్న ఆ ఉపాధ్యాయులతో చేతులు కలిపి డీఈవో విజయకుమారి తన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తెచ్చారని, ఒప్పుకోనందుకు కక్ష సాధింపు చర్యగా చిన్నసాకులతో తనను సస్పెండ్ చేశారని వాపోయింది. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. కమిషనర్ చర్యలు తీసుకోకపోతే మెదక్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కిషన్‌నాయక్ పేర్కొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ గెస్ట్‌హౌస్‌లో మందు పార్టీ

- **10మంది ఉద్యోగులకు చార్జి మెమోలు**

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి): సంగారెడ్డిలోని ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం సిబ్బంది మందు పార్టీ చేసుకోవడం చర్చనీయాంశమైంది. అనుమతి లేకుండా గెస్ట్‌హౌస్‌ను తెరిచిన సిబ్బంది మందు పార్టీ చేసుకోవడంపై చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మందు పార్టీలో పాల్గొన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆమె సీఈవోకు సూచించారు. విచారణ జరిపిన సీఈవో రవి పది మంది ఉద్యోగులకు చార్జి మెమో ఇచ్చారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్ ఎక్కువగా నర్సాపూర్‌లోని తన సొంత ఇంట్లో ఉంటారు. అధికారిక కార్యకలాపాల నిమిత్తం సంగారెడ్డికి వచ్చినప్పుడే ఈ గెస్ట్‌హౌస్‌లో ఉంటారు. ఆమె లేని సమయాల్లో గెస్ట్‌హౌస్‌కు తాళం వేసి ఉంటుంది. అయితే జడ్పీలో పని చేసే జూనియర్ అసిస్టెంట్ ఒకరి జన్మదినం సందర్భంగా మంగళవారం రాత్రి చైర్‌పర్సన్ గెస్ట్‌హౌస్‌లో సిబ్బంది మందు పార్టీ చేసుకున్నారు. ఈ విషయం బుధవారం వెలుగులోకి రావడం అధికార, ఉద్యోగ వర్గాల్లో కలకలం రేపింది. దీంతో చైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు సీఈవో రవి మందు పార్టీలో పాల్గొన్న ఉద్యోగులను విడివిడిగా విచారించారు. అనంతరం పది మంది ఉద్యోగులకు చార్జి మెమోలు ఇచ్చారు. వారిలో సూపరింటెండెంట్లు రంగాచార్యులు, మనోజ్‌కుమార్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, జిల్లా శిక్షణా మేనేజర్, కార్యాలయ సబార్డినేటర్లు ఉన్నారు.



జడ్పీ చైర్‌పర్సన్ గెస్ట్‌హౌస్

తాగునీరు అనుకొని ఫినాయిల్ తాగి వాచ్‌మన్ మృతి

నారాయణఖేడ్, జనవరి 3: తాగు నీరు అనుకొని రాత్రి సమయంలో ఫినాయిల్‌ను తాగి ఎంపీపీ నైట్ వాచ్‌మన్ మృతి చెందాడు. ఎస్‌ఐ నరేందర్ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కిషన్ నాయక్ తండాకు చెందిన హీరూసింగ్ నారాయణఖేడ్ ఎంపీపీలో రాత్రి వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 1న తెల్లవారు జామున ఛాతిలో నొప్పి రావడంతో తన తండాలోని సొంతింటి వాకిట్లో కూర్చున్నాడు. అనంతరం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి ఆవరణలో ఉన్న మరుగుదొడ్డి వద్దకు వెళ్లగా దాహం వెయ్యడంతో పక్కనే ఉన్న ఫినాయిల్ సీసాను తీసుకొని తాగునీరుగా భావించి తాగాడు. అనంతరం వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వచ్చినప్పటికీ స్థానిక వైద్యులు సూచనకు మెరుగైన వైద్యం కొరకు హైదరాబాద్ తరలించారన్నారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని, మృతుడి భార్య హీరి బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉంటారని తెలిపారు. ఎంపీపీ కార్యాలయంలో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ హీరూసింగ్ మృతి చెందడం పట్ల ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో బాలయ్య సంతాపం ప్రకటించారు. మృతుడి అంత్యక్రియల కోసం ఎంపీపీ ద్వారా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.



హీరూసింగ్ (ఫైల్)

మృతుడి కుటుంబాన్నిఆదుకోవాలి

ఎంపీపీ నైట్ వాచ్‌మన్ హీరూసింగ్ మృతి చెందడం పట్ల ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని నాలుగవ తరగతి ఉద్యోగ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంబాదాస్, ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్, కోశాధికారి శ్రీనివాస్, స్థానిక బాధ్యులు సిరాజ్, అంజయ్య, లంబాడ సంఘం నాయకులు కిషన్ నాయక్, తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

నేడు నిజాంసాగర్‌కు సింగూరు జలాలు

- 4 టీఎంసీల విడుదలకు ప్రభుత్వ ఉత్తర్వులు
- దశలవారీగా విడుదల

పుల్‌కల్, జనవరి 3 : నిజాంసాగర్ ఆయకట్టు పరిరక్షణకు గురువారం సింగూరు జలాలను విడుదల చేయనున్నారు. యాసంగి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని 4 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సింగూరు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలనున్నారు. రోజుకు 0.35 టీఎంసీల చొప్పున దశలవారీగా నీటిని విడుదల చేయనున్నామని నీటి పారుదల శాఖ ఈఈ రాములు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. సింగూరు జలాలు విడుదల చేస్తున్నందున మంజీర నది తీర ప్రాంత రైతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీంతో పాటు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. ఈ విషయాన్ని నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లో దండోరా వేయించనున్నామన్నారు.

టీపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



టీపీటీఎఫ్ నూతన డైరీని ఆవిష్కరిస్తున్న ఏడీ చిన్మయి

మెదక్ అర్బన్, జనవరి 3: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ 2018 నూతన సంవత్సర డైరీని బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ చిన్మయి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాముని రమేశ్, హీరాలాల్, ఉపాధ్యక్షుల చంద్రశేఖర్, ప్రవీణకుమార్, మురళీ, మొయిజొద్దీన్,బాగయ్య , శ్రీనివాస్, రాంచంద్రారెడ్డి, నజిరొద్దీన్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

మెదక్ అర్బన్, జనవరి 3: పీఆర్టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం మండల వనరుల కేంద్రంలో ఎంఈవో నీలకంఠం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెదక్, హవేళీఘణపూర్ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్‌రావు, సంతోష్‌కుమార్, రామకృష్ణ, రఘుబాబు, జిల్లా బాధ్యులు సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు రవి, మహేశ్, ప్రవీణ్, సభ్యులు సుభాష్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, బాలఅనపోతరెడ్డి, అక్బరుద్దీన్, పవన్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములవ్వాలి

- ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 3: తెలంగాణ ఉద్యమంలో టీఎన్జీవోల పాత్ర కీలకమైందని, జిల్లా అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని టీఎన్జీవో నేతలకు డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మెదక్ క్యాంపు కార్యాలయంలో జిల్లా టీఎన్జీవో శాఖ ఉపసభాపతికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేడి శ్యాంరావు, దొంత నరేందర్, అసోసియేట్ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, కోశాధికారి జెల్ల సుధాకర్, యూనిట్ బాధ్యులు ప్రభాకర్‌శర్మ, నాగరాజుగౌడ్, శ్రీహరిరాజ్, శివాజీ, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన డైరీ ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్

ఎస్టీయూ నూతన సంవత్సర డైరీని బుధవారం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ప్రణీద్‌కుమార్, నాయకులు సిద్ధిరాములు, వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, వినయ్, నవీన్, రత్నాకర్, కుమార్, దుర్గారాములు తదితరులు పాల్గొన్నారు.



ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలుపుతున్న శాసనసభ కార్యదర్శి నర్సింహచారి

ఉపసభాపతికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన శాసనసభ కార్యదర్శి

నూతన సంవత్సర పర్వదినం పురస్కరించుకొని హైదరాబాద్ మినిస్టర్స్ క్వాటర్స్‌లో ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డికి శాసనసభ కార్యదర్శి నర్సింహచారి పుష్పగుచ్ఛం అందజేసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రణాళికతో ముందుకెళ్లాలి : జాయింట్ కలెక్టర్ నగేశ్

మెదక్ అర్బన్, జనవరి 3: ప్రణాళికతో ముందుకెళ్లినప్పుడే ఎంతటి లక్ష్యాన్నైనా అధిరోహిస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ నగేశ్ విద్యార్థినులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు పాల్గొని విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. అందులో భాగంగా రెసిడెన్షియల్ పాఠశాలలను, కళాశాలలను ప్రారంభించి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన అందిస్తుందన్నారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌వో రాములు, జిల్లా సంక్షేమాధికారి కోటాజీ, ప్రిన్సిపాల్ యాదగిరిరెడ్డి, వార్డెన్ జయరాజ్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జేసీ

అత్యాధునికంగా'ముంపు' కాలనీ నిర్మాణం

గజ్వేల్, జనవరి 3: మల్లన్నసాగర్, కొండ పోచమ్మ జలాశయ ముంపు నిర్వాసితుల కాలనీలను అత్యాధునిక పద్ధతిలో నిర్మించనున్నట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ పారుపాటి వెంకట్రామారెడ్డి తెలిపారు. గజ్వేల్ మండలం ముట్రాజ్‌పల్లి రెవెన్యూ గ్రామపరిధిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు కలెక్టర్ స్థలాలను, మ్యాపులను పరిశీలించి మాట్లడారు. రాజీవ్‌రహదారి నుంచి తూప్రాన్ రోడ్డు వరకు స్ట్రిప్ డెవలప్మెంట్(క్రమ పద్ధతిలో) కాలనీల అభివృద్ధి జరుగబోతున్నదని తెలిపారు.

ముట్రాజ్ పల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయన్నారు. గజ్వేల్ ప్రజల అవసరాల దృష్ట్యా అత్యాధునిక పద్ధతిలో సువిశాలమైన రోడ్లతో కాలనీలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ పద్మాకర్, గజ్వేల్ ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నాటికి వంద పడకల ఆసుపత్రి

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని ఫిబ్రవరి 1నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు. పట్టణంలోని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను, వంద పడకల ఆసుపత్రి పనులను బుధవారం ఆయన జేసీ పద్మాకర్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు.

ఫిబ్రవరి 1నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అన్ని ఏర్పాట్లు చేసి, అద్భుతమైన చెట్లను, క్లాక్ టవర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

తున్కిబొల్లారంలో

ములుగు, జనవరి 3: మండలంలోని తున్కిబొల్లారం శివారులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు జరుగుతున్న స్థలాలను బుధవారం కలెక్టర్ వెంకట్రామారెడ్డి పరిశీలించారు. కొండపోచమ్మ జలాశయం ముంపు గ్రామాలైన బైలాంపూర్, మామిడ్యాల, తానేదార్‌పల్లి ప్రజలకు ప్రత్యామ్నాయంగా తున్కిబొల్లారం శివారులో అత్యాధునికంగా నిర్మించనున్న ఇళ్ల సైట్, లేఅవుట్ల పురోగతిని పరిశీలించారు.

కలెక్టర్ వెంట జేసీ పద్మాకర్, ఆర్డీవో ఉన్నారు.

స్త్రీనిధి రుణ లక్ష్యం సగం పూర్తి

- జిల్లాలో 13,464 మంది డ్వాక్రా మహిళలకు లబ్ధి
- డెయిరీ రుణాలకు ఈనెలాఖరు గడువు
- స్త్రీనిధి బ్యాంకు రీజనల్ మేనేజర్ అనంత కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీ నిధి బ్యాంకు రీజనల్ మేనేజర్ అనంతకిషోర్

తూప్రాన్ రూరల్, డిసెంబర్ 3 : జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు ఈ యేడు ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 61 కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యం కాగా అందులో ఇప్పటివరకు 36 కోట్ల రుణాలను 3330 సంఘాల్లోని 13,462 మంది మహిళలకు వ్యక్తిగత రుణాలను ఇచ్చినట్లు స్త్రీనిధి బ్యాంకు రీజినల్ మేనేజర్ అనంత కిషోర్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మార్చి నెలాఖరుకల్లా మిగతా రూ.25 కోట్ల రుణాలను అందిస్తామని చెప్పారు. రుణాల చెల్లింపుల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. రుణాల రికవరీలో నర్సంపల్లి, కూచారం, పరికిబండ, పోతారం గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ గ్రూపులు వెనకబడి ఉన్నట్లు ఆయన తెలిపారు. రుణాలపై వడ్డీ 13.5 నుంచి 12.5 శాతానికి తగ్గినట్లు కిషోర్ తెలిపారు. రుణాలకు అర్హులైన మహిళను గుర్తించడానికి హెచ్‌ఎల్‌పీ సర్వే చేయించామని, దాని ఆధారంగా రుణాలను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రుణాల చెల్లింపులు, సద్వినియోగం, రికవరీలపై స్త్రీనిధిలో కూడ సోషల్ ఆడిట్ ఉంటుందని చెప్పారు. వ్యక్తిగతంగా పాడిగేదెల యూనిట్ కోసం రుణాలు తీసుకోవడానికి ఈ నెలాఖరు వరకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని సంఘాల మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అనారోగ్యం కారణంగా మృతి చెందిన 15 మంది మహిళా కుటుంబాలు రుణాలపై బీమా సదుపాయం పొందారని ఆయన చెప్పారు. స్త్రీనిధి బ్యాంకు కొత్త పథకాల గురించి గ్రామ సంఘాల ఆఫీస్ బేరర్స్, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు మండలాల వారీగా గురువారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కిషోర్ తెలిపారు. ఈ ఏడాది 42 మంది ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో తూప్రాన్, మనోహరబాద్ మండలాల ఏపీఎంలు, సీఏలు పాల్గొన్నారు.

రైతుల త్యాగాలకు వెలకట్టలేం

- జిల్లా కలెక్టర్ వెంకట్రామారెడ్డి
- గంటన్నరలో మూడు గ్రామాలతో చర్చలు సఫలం
- భూములిచ్చేందుకు ముందుకొచ్చిన ప్రజలు




మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రామారెడ్డి, హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, భూనిర్వాసితులు

సిద్దిపేట, జనవరి 3: జిల్లాలో ప్రాజెక్టులు, కాల్వల భూ సేకరణ కోసం రైతులు చేసే త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ వెంకట్రామారెడ్డి అన్నారు. సిద్దిపేట సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ పద్మాకర్‌తో కలిసి బెజ్జంకి మండలంలోని గుండారం, కల్లేపల్లి, వడ్లూరి బేగంపేట గ్రామాలవారితో కాల్వలకు భూసేకరణపై ఆయన చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంతగిరి రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా 10వ ప్యాకేజీ కెనాల్, డీ7 డిస్ట్రిబ్యూటరీలో భాగంగా బెజ్జంకి మండలం గుండారం గ్రామం మీదుగా 46 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉన్నదని, ఈ కాల్వల భూ సేకరణతో 4 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నదని కలెక్టర్ వివరించారు. ఈ విషయమై గుండారం గ్రామానికి చెందిన 40 మంది, కల్లేపల్లి, వడ్లూరి బేగంపేట గ్రామాల్లో భూ యజమానుల అంగీకారంతో భూముల సేకరణకు కలెక్టర్ ఒప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కాబట్టి జిల్లాలో రైతు శ్రేయస్సు కోసం సాగునీటి రిజర్వాయర్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. విధివిధానాలకు అనుగుణంగా, చట్టాలకు లోబడి భూ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. పరిమితి లోపు భూ నిర్వాసితులకు న్యాయం చేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని జలాశయాలు ఉన్నచోట ప్రజలు, రైతులు కూడా సహకరిస్తున్నారన్నారు. జిల్లాలోని 270 గ్రామాల్లో జలాశయాల కోసం భూ సేకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 40వేల ఎకరాల భూ సేకరణ జరిగిందని, ఇంకా 10,530 వేల ఎకరాలను సేకరించాల్సి ఉన్నదన్నారు. జిల్లాలోని పరిస్థితులను గమనించి సహకరించాలని, భూ నిర్వాసితులకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. నేనూ రైతు బిడ్డను.. మిమ్మల్ని ఒప్పించి.. మెప్పించి.. మీ ఇష్టపూర్వకంగా భూసేకరణ చేయాల్సిన బాధ్యత ఉన్నదని వెంకట్రామారెడ్డి అన్నారు. ప్రజా ప్రయోజనార్థం జిల్లాలో నిర్మిస్తున్న జలాశయాల కోసం మీరు సహకరిస్తే.. మీ గ్రామాలకు లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. మీ గ్రామాభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని తెలిపారు. వారం రోజుల్లోపు నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ చర్చల్లో బెజ్జంకి తహసీల్దార్ శ్రీనివాస్, గుండారం, కల్లేపల్లి, వడ్లూరిబేగంపేట గ్రామస్థులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బియ్యం.. బడా మోసం

- జీఎస్టీ ఎత్తివేసినా పెరుగుతున్న ధరలు
- తగ్గాల్సిన చోట అధికమవుతున్న రేట్లు
- జిల్లాలో వినియోగదారులపై రూ.కోట్లలో భారం
- ఇష్టారాజ్యంగా దోచుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్, జనవరి 3 : దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం ఉండాలని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని అమల్లోకి తెచ్చింది. ఇందులో సామాన్య ప్రజలకు ఊరట కలిగించేలా అప్పటివరకు బియ్యంపై ఉన్న పన్నును పూర్తిగా తొలగించింది. ఈ లెక్కన బియ్యంపై అన్ని పన్నులనూ తొలగించింది. ధర కిలోపై రూ.4 నుంచి రూ.5 వరకు తగ్గాలి. కానీ అదేం విచిత్రమో... ధరలు దిగిరాలేదు. పైగా రూ.4 నుంచి రూ.5 వరకు పెరిగాయి. ఇష్టారాజ్యంగా విక్రయాలు సాగుతున్నా సంబంధిత శాఖలు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా వినియోగదారులపై నెలకు రూ.కోట్లలో భారం పడుతున్నది.



కిలో సన్న బియ్యం రూ.50 పైమాటే

నిత్యావసరాల్లో ముందు వరుసలో ఉండే బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పేదలే కాదు.. మధ్యతరగతి వారు కూడా ఈ ధరలను చూసి హడలెత్తిపోతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.50 పైగానే పలుకుతున్నది. జిల్లాలో 7.5లక్షల మందికి పైగా జనాభా ఉంది. వీరిలో కనీసం 70శాతం వరకు మేలురకం బియ్యాన్ని కొనుగోలుచేస్తారు. ప్రతివ్యక్తి రోజుకు సగటున 200 గ్రాముల బియ్యాన్ని వండుకుని తిన్నా 1,050 క్వింటాళ్ల వినియోగమవుతున్నాయి. ఈమేరకు నెలకు 31,500 క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో సన్న బియ్యం ధర రూ.50గా ఉంది. పాత బియ్యం గతేడాది రూ.5వేలు, రెండేళ్ల పాత బియ్యం రూ.5,500, సాధారణ రకం రూ. 4,500 లభిస్తున్నాయి. క్వింటాల్‌కు సగటున రూ.4,500 వరకు లెక్కేసినా ప్రతి నెలా రూ.14 కోట్ల వరకు కొనుగోలు చేస్తున్నట్లు అంచనా.

జీఎస్టీ నుంచి తొలగించినా

నిత్యావసరాల్లో బియ్యానికి జీఎస్టీ సున్నా శాతంగా ఉంది. కేవలం బ్రాండెడ్ రకం బియ్యం విక్రయిస్తే మాత్రం 5శాతం పన్ను విధిస్తున్నారు. ఇదే వ్యాపారులకు కలిసివస్తోంది. దీన్ని ఆసరగా చేసుకుని కోట్ల రూపాయల వ్యాపారాన్ని నిర్వహిస్తున్ననారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి పన్ను చెల్లించకుండానే రైతుల నుంచి కొనుగోలుచేసి వినియోగదారులకు విక్రయిస్తూ అడ్డగోలు లాభాలు గడిస్తున్నారు. ఈ తంతులో ఎక్కడా వారు రూపాయి కూడా సర్కారుకు పన్ను చెల్లించడం లేదు. జులై నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. జీఎస్టీ రాకతో బియ్యం ధరలు తగ్గుతాయని అందరూ భావించారు. కానీ మరింతగా పెరుగుతున్నాయి. కేవలం 3నెలల వ్యవధిలోనే బియ్యం ధర క్వింటాల్‌కు రూ.500 పెంచేశారు. క్వింటాల్ రూ.5వేలుగా ఉంటే.. జీఎస్టీ 5శాతం పన్ను మినహాయిస్తే.. క్వింటాల్‌కు రూ.500 వరకు ధర తగ్గాలి. ఎక్కడా ఆ దాఖలాలు కనిపించడం లేదు. పెరుగుతూనే ఉన్నాయి. గతేడాది కొత్త బియ్యం క్వింటాల్‌కు రూ.3700 ఉండగా ప్రస్తుతం రూ.4,500కు చేరింది. పాత బియ్యం రూ.5వేలు నుంచి రూ.5,500 వరకు ఎగబాకాయి. ఈ లెక్కన సర్కారు చెల్లించాల్సిన 5శాతం పన్నుతో పాటు ధరలు పెంచి క్వింటాల్‌కు రూ.800నుంచి రూ.1000 వరకు దండుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పరిగణలోకి తీసుకుంటే కనీసం నెలకు రూ.2.5 కోట్లను వినియోగదారుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని టోకు, చిల్లర వ్యాపారులు జేబులో వేసుకుంటున్నారు.

సిండికేట్‌గా మారి ధరల పెంపు

జిల్లాలో టోకు, చిన్న బియ్యం వ్యాపారులు వెయ్యి మందికిపైగానే ఉన్నారు. వీరందరూ ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. రైతులు మిల్లులో వడ్లు ఆడించి.. బియ్యంగా మార్చి వాటిని టోకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మరికొందరు వ్యక్తులు నేరుగా విక్రయాలు సాగిస్తున్నారు. కొత్త బియ్యం మార్కెట్లోకి వచ్చే సందర్భంలో కృత్రిమ కొరత సృష్టించి ధరను పెంచేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

జీఎస్టీ అందుబాటులోకి వచ్చినా బియ్యం ధరలు దిగిరాలేదు. పైగా పెరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా జీరో దందా కొనసాగిస్తూ సర్కారు ఖజానాకు గండి కొడుతున్నారు. అనధికార నిల్వలు పెట్టుకుని ఎమ్మార్పీ ధరలను ఉల్లంఘించి మరీ ప్రజలను దోచుకుంటున్నారు. అయినా పౌర సరఫరాలు, వాణిజ్య పన్నుల శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల బియ్యం దందాను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాకు ఎన్ని బియ్యం వస్తున్నాయి? వ్యాపారులు వాటిని ఎక్కడ? ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు? అందుకు సంబంధించి ప్రభుత్వానికి ఎంత పన్ను చెల్లిస్తున్నారు? ఎంత ధరకు విక్రయిస్తున్నారు? వంటి అంశాలపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో బియ్యం ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

కలెక్టర్ బదిలీని ఉపసంహరించుకోవాలి

- కాంగ్రెస్ నేత బట్టి జగపతి



మాట్లాడుతున్న బట్టి జగపతి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 3: ప్రజల పక్షాన నిలిచిన జిల్లా కలెక్టర్ భారతి హోళికేరిని బదిలీ చేయడం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నేత బట్టి జగపతి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌ను ఎందుకు బదిలీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను పరుగుపెట్టిస్తే బదిలీ చేయించడం ఎంత వరకు సమంజసమన్నారు. తక్కువ సమయంలో మెదక్ జిల్లా కీర్తిని జాతీయస్థాయిలో చాటిచెప్పిన కలెక్టర్ బదిలీని ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి వెంటనే నిలిపివేయించాలని కోరారు. ప్రజల మన్ననలను పొందిన కలెక్టర్ భారతి హోళికేరికి తామంతా రుణపడి ఉంటామన్నారు. స్థానిక రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం పాలనాధికారిని బదిలీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కలెక్టర్ బదిలీపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శ్యాంసుందర్, మామిళ్ల ఆంజనేయులు, అఫీసొద్దీన్, చందు, వేణు, రవి, మొహిన్, ముజీబ్, మిర్జాఅమీద్‌అలీ, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

విద్యుద్దీకరణ పనులు వేగవంతం చేయాలి

- భవిష్యత్ ప్రయోజనాల దృష్ట్యా లైన్లను విస్తరించాలి
- పనిలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- అధికారుల సమావేశంలో ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 3 : మెదక్ పట్టణంలో విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం చైర్మన్ చాంబర్‌లో విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లో థర్డ్ వైర్ లేకపోవడంతో ఉదయం సమయంలో కూడా వీధి లైట్లు వెలుగుతున్నాయని ఉప సభాపతి దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా 23, 9, 24, 14, 6, 3, 2, 8, 16, 15 వార్డుల్లో శిథిలావస్థకు చేరిన కండక్టర్ వైర్‌తో పాటు స్తంభాలను తొలగించాల్సిందిగా కోరారు. కొన్ని ప్రాంతాల్లో వైర్లు తొలగిపోయి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. మరికొన్ని వార్డుల్లో లోవోల్టేజీ కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పరిష్కరించాల్సిందిగా కౌన్సిలర్లు గగ్గోలు పెట్టారు. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా అవసరమైన మేరకు ఏర్పాటు చేయించాలని ఉపసభాపతి దృష్టికి తీసుకువచ్చారు. మరమ్మతులు చేయాలని పలుమార్లు పట్టణ ఏఈకి ఫోన్ చేసినప్పటికీ స్పందించడం లేదని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు విన్న ఉపసభాపతి అనంతరం మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో అవసరమైన మేరకు స్తంభాలు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన సహకారం తాను అందిస్తానని ఉపసభాపతి విద్యుత్ శాఖ అధికారులకు చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా కొనసాగుతున్న పనులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో విద్యుదీకరణ కోసం రూ.10 కోట్లు మంజూరైనప్పటికీ అలసత్వం ఎందుకు ప్రదర్శిస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. మంజూరైన 100 ట్రాన్స్‌ఫార్మర్లు అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో వెంటనే ఏర్పాటు చేయించాలని ఎస్ఈ శ్రీనాథ్, డీఈ వెంకటరత్నంలను ఆదేశించారు. జిల్లా కేంద్రం విస్తీర్ణం పెరుగుతున్న దృష్ట్యా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలనీలకు అదనంగా లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మినీ ట్యాంక్‌బండ్, మల్లం చెరువు, పిట్లం చెరువు ప్రాంతాల్లో లైనింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు ముందుకు సాగుతుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. నెల రోజుల్లో పనులను తాను పరిశీలిస్తానని పూర్తి చేయకపోతే బదిలీలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, వైస్‌చైర్మన్ రాగి అశోక్, కమిషనర్ ప్రసాద్‌రావు, కౌన్సిలర్లు మేడి మధుసూదన్‌రావు, వెంటకరమణ, దివాకర్, సోహెల్, సాదిక్, నాగయ్య, సలామ్, మాయ మల్లేశం, ఐతారం నర్సింలు, ఆర్కె శ్రీనివాస్, జ్యోతి, రాధాబాయి, చంద్రకళ, సులోచన ప్రభురెడ్డి, విజయలక్ష్మి, బట్టి సులోచన పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి3: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు సమన్వయంతో పని చేసి వేగం పెంచాలని ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచా యతీరాజ్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతూ మిషన్ భగీరథ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పట్టణ రహదారి విస్తరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా మెదక్ – చేగుంట రహదారి పనులు చివరిదశకు చేరుకున్నందున పూర్తి లక్ష్యాన్ని అందుకునేలా అధికారులు చూడాలన్నారు. పంచాయతీరాజ్ శాఖలో జరుగుతున్న బ్రిడ్జిలు, కల్వర్టులు, సామాజిక భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మెదక్ పట్టణంలో కులసంఘాలకు మంజూరు చేసిన కమ్యూనిటీ హాళ్ల పనులను వెంటనే ప్రారంభించాలని పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఆర్డీవో మెంచు నగేష్‌గౌడ్, జెడ్పీటీసీ లావణ్యారెడ్డితో పాటు ఆయాశాఖల ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాల్సిన బాధ్యత అందరిదీ

- ఉప సభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి
- స్వచ్ఛ సర్వేక్షన్‌లో కేంద్ర అవార్డును సాధిద్దాం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 3: జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ మెదక్ పట్టణంలో పరిశుభ్రత పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి తెలియజేశారు. బుధవారం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా నాల్గో వార్డులో ఏర్పాటు చేసిన చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఏర్పాటు అనంతరం అభివృద్ధికి మరిన్ని నిధుల మంజూరుకు తనవంతు కృషి చేస్తున్నానని చెప్పారు. పట్టణంలో రూ.50 కోట్లతో శాశ్వత తాగునీటి పనులు, ప్రధాన రహదారి విస్తరణ, చేగుంట-మెదక్ రోడ్డు విస్తరణ ఇలా ఎన్నో పనులు అభివృద్ధి దశలో ఉన్నాయని గుర్తుచేశారు. మున్సిపల్ పరిధిలో స్వచ్ఛతను పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో ఇప్పటికే రాష్ట్రస్థాయి విభాగంలో మొదటి స్థానంలో ఉన్నందుకు అధికారులను అభినందించారు. చివరి లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంలో కూడా ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు. శానిటేషన్ విషయంలో సహకరిస్తే కేంద్ర ప్రభుత్వం అందజేసే అవార్డుకు ఎంపికవుతామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం 3, 4, 5, 6 వార్డుల మహిళలకు తడి వేయడానికి చెత్త బుట్ట, పొడి వేయడానికి బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్‌తో పాటు కమిషనర్ ప్రసాద్‌రావు, కౌన్సిలర్లు చంద్రకళ, విజయలక్ష్మి, వెంకటరమణ, రాధాబాయి, ఐతారం నర్సింలు, మాయ మల్లేశ్, సాదిక్, అరవింద్‌గౌడ్, లక్ష్మినారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.



నాల్గో వార్డులో మాట్లాడుతున్న ఉప సభాపతి

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి

రామాయంపేట, జనవరి 3: సావిత్రీ బాయి పూలే జయంతోత్సవాలు బుధవారం జరిగాయి. ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పూలె చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన జయంతి సభలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పాతూరి రాజు, రజకసంఘం మండల అధ్యక్షుడు వెంకటి, శ్రీనివాస్ మాట్లాడుతూ ఆమె సేవలను కొనియాడారు.

హవేళిఘణపూర్‌లో

హవేళీఘణపూర్, జనవరి 3: బుధవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో సావిత్రీ బాయి పూలే 187వ జయంతి వేడుకలను వ్యవసాయ కార్మికసంఘం జిల్లాకార్యదర్శి మల్లేశం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకుని అభివృద్ధిపథం దిశగా పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కవిత, దుర్గ, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో

పెద్దశంకరంపేట, జనవరి 3: సావిత్రీబాయిపూలే చేసిన సేవలు చిరస్మరణీయమని మెదక్ జిల్లా జాగృతి అధ్యక్షురాలు రాజేశ్వరి అన్నారు.

బుధవారం పేట బాలికల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఉఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.వీ రవీందర్, ఉపాధ్యాయులు జనార్దన్, చక్రపాణి, రామక్రిష్ణగౌడ్, సునీత, తదితరులు పాల్గొన్నారు.





సావిత్రీబాయి పూలే జయంతి సభలో మాట్లాడుతున్న పాల్గొన్న పాతూరి రాజు, హవేళిఘణపూర్‌లో వేడుకలను నిర్వహిస్తున్న మల్లేశం

అభ్యాసన అభివృద్ధితో విద్యాభివృద్ధి

రాష్ట్ర పరిశీలకుడు రవీందర్‌రెడ్డి



ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు రవీందర్‌రెడ్డి

రేగోడు, జనవరి 3: అభ్యాసన అభివృద్ధి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధి చెందినదని రాష్ట్ర పరిశీలకుడు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం త్రిఆర్పీకార్యక్రమంపై రేగోడు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, మోడల్ పాఠశాలలో పరిశీలించారు. విద్యార్థులకు రోజు తీసుకెళ్లే బ్యాగ్‌లను తూకం చేసి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, గణితం, తెలుగు, సైన్స్ సబ్జెక్టులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్‌రావు, హెచ్ఎం లక్ష్మన్, మంజరి, సీఆర్పీ సంతోష్, తదితరులు ఉన్నారు.

'సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించాలి'



జగిర్యాలలో గ్రామ సభ

రేగోడు, జనవరి 3: గ్రామాన్ని సంపూర్ణ పారిశుధ్యంగా చేయడానికి సహకరించాలని సర్పంచ్ లక్ష్మీరాములు అన్నారు. బుధవారం జగిర్యాలలో గ్రామ సభ నిర్వహించారు. వందశాతం మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీసీల ఫోరం అధ్యక్షుడు అనిల్‌పాటిల్, గ్రామకార్యదర్శి రాములు, ఉపసర్పంచ్ నర్సింలుయాదవ్, హన్మాండ్లుతదితరులు ఉన్నారు.

కాకంచతండాలో క్రికెట్ టోర్నీ

రేగోడు, జనవరి 3: మండలంలోని కాకంచతండాలో 8నక్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రవి, వసంత్, రంజిత్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల టీంలు రూ.500 ఎంట్రిఫీజుతో పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. వివరాలకు 9912123580 నెంబరుకు ఫోన్ చేయాలని అన్నారు.

చేసిన సేవలకే గుర్తింపు : తహసీల్దార్ ఆర్పీ సింగ్

రేగోడు, జనవరి 3: ఉద్యోగ, సమాజ సేవలో చేసిన గుర్తింపే చిరకాలం ఉంటుందని తహసీల్దార్ ఆర్పీ సింగ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రేగోడు పీపీసీఎస్ సీఈవో ఎండీ సర్దార్ పదవీ విరమణ చేయడంతో సన్మాన కార్యక్రమాన్ని రేగోడు నోబుల్‌యూత్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బస్వనప్ప, సీఈవో హఫీజ్, ఎంఈవో అశోక్‌రావు, నోబుల్‌యూత్ అధ్యక్షుడు సుమన్, వినయ్‌కుమార్, మహేశ్, దత్తు, జగదీశ్, అమృతచందర్, పరశురాంగౌడ్, సతీష్, నాయకులు పూర్ణచందర్, నర్సింలు, తదితరులు ఉన్నారు.



సర్దార్‌కు సన్మానం చేసి మెమోరాండం అందించిన యూత్ బాధ్యులు

మూసాపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెద్దశంకరంపేట, జనవరి 3 : పెద్దశంకరంపేట మండలపరిధిలోని మూసాపేటలో రూ.4..95 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు రాంచంద్రారావు ఇచ్చిన నిధులతో పనులను ప్రారంభం చేశామని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ జైహింద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాలి, ఉప సర్పంచ్ సత్తమ్మ, సాయిరెడ్డి, రాజు, కుషుకుమార్, లు ఉన్నారు.



మూసాపేటలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న రాంచంద్రారావు

ధర్మారంలో వైకుంఠ ధామానికి భూమిపూజ

రామాయంపేట, జనవరి 3: రామాయంపేట మండల పరిధి డిధర్మారం గ్రామంలో వైకుంఠధామం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. రూ.10 లక్షలు ఈ పనులకు విడుదల కాగా బుధవారం గ్రామ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో భూమిపూజ చేశారు. గ్రామ సర్పంచ్ సిద్దయ్య, ఎంపీటీసీ స్వామి, ఏపీవో రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వైకుంఠ ధామానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

'మరుగుదొడ్ల బిల్లులు చెల్లించాలి'



పెద్దశంకరంపేటలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామసభలో లబ్ధిదారుల ఆవేదన

పెద్దశంకరంపేట, జనవరి 3: ఐఎస్‌హెచ్‌సీ పథకం ద్వారా ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకున్నప్పటికీ ఇప్పటివరకు తమకు బిల్లులు రాలేదని లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

బుధవారం మండల కేంద్రమైన పెద్దశంకరంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. లబ్ధిదారులు తమకు మరుగుదొడ్ల బిల్లులు రాలేదని తెలుపడంతో సర్పంచ్ జంగం శ్రీనివాస్, అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దశంకరంపేట గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం తమ వంతు నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శంకర్‌చింతల, ఏపీఎం మహిపాల్‌రెడ్డి, ఈవో నవీన్, వార్డు సభ్యులు నారాయణ, బాలయ్య, స్వరూక హరికిషన్, రాజుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ మురళి పంతులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు పంపిణీ

హవేళీఘణపూర్, జనవరి 3: బుధవారం మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు ఇచ్చినట్లు అసిస్టెంట్ డాక్టర్ సలావొద్దీన్ తెలిపారు. పాడిరైతులందరూ తమ పశువులకు తప్పని సరిగా ఈ టీకాలు వేయించాలని సూచించారు.

'సావిత్రీబాయిపూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి'

చిన్నశంకరంపేట, జనవరి 2: సావిత్రీ బాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో బాల సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సావిత్రీ బాయిపూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఆమె మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించిన తొలి మహిళ సావిత్రీబాయి పూలే అన్నారు. మహిళలు విద్యకు దూరంగా ఉండా లన్న విషయాన్ని ఆమె ఛేదించి స్త్రీజాతికే ఓ ఆభరణంగా నిలిచిందని కొనియాడారు. సావిత్రీబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలంటూ టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాదగిరి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో బాల

ప్రమాదకరం అయినా.. పట్టించుకోరు !

- జనసమూహ ప్రాంతాల్లోనే గ్యాస్ సిలిండర్లు
- గ్యాస్ ఏజెన్సీలకు నిబంధనలు వర్తించవు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న డీలర్లు

మెదక్ రూరల్ జనవరి 3: పేలుడు సామర్థ్యం కలిగిన వస్తువులు పట్టణ, జన సమూహం ఉన్నప్రాంతాల్లో నిల్వ ఉంచడానికి అనుమతి లేదు.. అందులోను ప్రమాదకరమైన గ్యాస్ సిలిండర్లపై మరింత అప్రమత్తంగా ఉండాలి..కానీ డీలర్లే ఏజెన్సీ కార్యాలయాల వద్ద స్టాక్‌పెట్టి విక్రయాలు సాగిస్తున్నారు.. నడిరోడ్డుపైనే పదులసంఖ్యలో సిలిండర్లు విక్రయిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో జిల్లాలో 13 వివిధ కంపెలకుచెందిన 13గ్యాస్‌ఏజెన్సీలు ఉన్నాయి. ఇందులో పట్టణకేంద్రంతో గ్యాస్‌కార్యాలయం వద్ద బుకింగ్ చేయడంతో ఇతర కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం పేలుడు సామర్థ్యం కలిగిన గ్యాస్ సిలిండర్లు ఏజెన్సీల వద్ద ఉంచకూడదు. కంపెనీ నుంచి వచ్చిన సిలిండర్లు నేరుగా పట్టణ, మండల కేంద్రాలకు దూరంలో ఏర్పాటు చేసిన గోదాం నుంచే సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లాకేంద్రంలోనే నిబంధనలు తుంగలో తొక్కేస్తారు. జిల్లా అధికారులు నిత్యం తిరిగే మార్గంలోనే ఏజెన్సీలను గోదాంలుగా మార్చి సిలిండర్లు అందజేస్తున్నారు. నర్సాపూర్– మెదక్ ప్రధాన రహదారిపై ఉన్న ఓ ఏజెన్సీ వద్ద ప్రతిరోజు గోదాం నుంచి తీసుకు వచ్చిన గ్యాస్ సిలిండర్లు భారీసంఖ్యలో పెట్టి అక్కడి నుంచే పట్టణ, గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. అలాగే ఇతర ఏజెన్సీ డీలర్లు కూడా ఇదే పద్ధతిని కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలో నిమరో ఏజెన్సీ వద్ద కూడా భారీగా సిలిండర్లు నిల్వలుపెట్టి అక్కడినుంచే పంపిణీ చేపడుతున్నారు.

అత్యధిక పేలుడు సామర్థ్యం కలిగిన గ్యాస్ సిలిండర్ అధికసంఖ్యలో నిల్వ ఉండే ప్రాంతంలో రక్షణ చర్యలు తీసుకున్న తర్వాతనే గోదాంలు ఏర్పాటు చేస్తారు. కానీ ఎలాంటి ముందు జాగ్రత్తలు లేకుండా ఉండే ఏజెన్సీల వద్ద భారీఎత్తున సిలిండర్లు నిల్వఉంటే ఏదైనా ప్రమాదం జరిగే బాధ్యులు ఎవరన్నది అధికారులు సమాధానం చెప్పాలి. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు తీసుకువచ్చిన నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఏజెన్సీలు వ్యవహరిస్తున్నా అధికారులుమాత్రం చూసిచూడనట్లు వ్యవహరించడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజల రక్షణను దృష్టిలో పెట్టుకొని జనసముహ ప్రాంతాల్లో ప్రమాదకరమైన పేలుడు సిలిండర్లు ఉండకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.




మెదక్ పట్టణంలోని చాముండి ఏజెన్సీ వద్ద సిలిండర్లు, భారీ సంఖ్యలో నిల్వ ఉంచిన సిలిండర్లు

సిలిండర్లు పెడితే చర్యలు తీసుకుంటాం

గ్యాస్ ఏజెన్సీ డీలర్ల వద్ద సిలిండర్లు పెట్టి సరఫరా చేస్తే విచారణ చేపడుతాయని జిల్లా పౌరసరఫరాశాఖ అధికారిణి రేవతి తెలిపారు. ఒకటి రెండు మినహా ఎక్కువ సంఖ్యలో సిలిండర్లు పెట్టడానికి అనుమతి లేదన్నారు. అలా పెట్టిన ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

–రేవతి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

కులవృత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- వంజరి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ సభలో ప్యాక్స్ ఛైర్మన్

రామాయంపేట, జనవరి 3:కుల వృత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహం మెండుగా లభిస్తోందని కోనాపూర్ పీఏసీఎస్(ప్యాక్స్) ఛైర్మన్ టీఆర్ఎస్ రాష్ట్రనేత దేవేందర్‌రెడ్డి అన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. వంజరి సంఘం ఉమ్మడిజిల్లా 2018 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సభ బుధవారం రామాయంపేటలో జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ కులాలకు ఎన్నో సంక్షేమఫలాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పుట్టి విజయలక్ష్మి, జడ్పీటీసీ బిజ్జ విజయలక్ష్మి, మండల వైస్‌చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, సర్పంచ్ పాతూరి ప్రభావతి, వంజరి సంఘం రాష్ట్ర నాయకుడు నవాత్‌సురేష్, నవాత్ రాజు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశం, కిరణ్, సుధాకర్, సాంగని శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

పాఠశాలను దత్తత తీసుకున్న వాసవీ క్లబ్

- వసతులు కల్పిస్తామని హామీ

మెదక్ అర్బన్, జనవరి 3: వాసవీ క్లబ్ చేసే సేవలో భాగంగా అజంపురలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకున్నట్లు ఆ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, బొందుగుల లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం విద్యార్థులు కూర్చోడానికి చాపలతో పాటు ఆకర్షణీయమైన చార్టులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు కనీస వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు శివనంది నారాయణ, కొవ్వూరి శ్రీనివాస్, విద్యావలంటీర్ అనిత పాల్గొన్నారు.



విద్యార్థులకు చార్టులను అందజేస్తున్న వాసవీ క్లబ్ బాధ్యులు

'పట్టుదలకు ప్రతీక సావిత్రీబాయిపూలే'

మెదక్ అర్బన్, జనవరి 3: త్యాగానికి, ధైర్యానికి, పట్టుదలకు ప్రతీక విద్యావేత్త సావిత్రీబాయిపూలే అని జిల్లాయువజన సంఘం అధ్యక్షుడు వడ్ల సాయిబాబా కొనియాడారు. సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో యువజనసంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మెదక్, వెల్దుర్తిమండలాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నర్సింహచారి, జిల్లా ఉపాధ్యక్షుడు నాయిని ప్రవీణ్, జిల్లా కార్యదర్శి రమేశ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు మణికుమార్, చిన్నశంకరంపేట, పాపన్నపేట మండలాల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, రాజు, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డప్పు, చెప్పులకు పెన్షన్ ఇవ్వాలి

- పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు పెట్టాలి
- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

మెదక్ రూరల్, జనవరి 3: డప్పు, చెప్పు రూ. 2000 పెన్షన్ ఇవ్వాలని, పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు పెట్టాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లాఅధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇతరకులాలకు వృత్తిపరంగా ఇస్తున్న పెన్షన్లకు కూడా డప్పు కొట్టిన, చెప్పులు కుట్టిన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరపై రాష్ట్రప్రభుత్వం అఖిలపక్షంతో ఢిల్లీ వెళ్లి శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్‌లో బిల్లు పెట్టించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జేసీ నగేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లద్ద నర్సింలు, బిక్షపతి, లింగంలతోపాటు పలవురు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌వద్ద ధర్నా నిర్వహిస్తున్న నేతలు

'గ్రామాభివృద్ధికి కృషి

హవేళీఘణపూర్, జనవరి 3: గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హవేళీ ఘణపూర్ సర్పంచ్ సునీతాసాయిలు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన హవేళీఘణపూర్‌లోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ గ్రామసభ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, గ్రామ ఉపసర్పంచ్ సిద్ధయ్య, వార్డు సభ్యులు శ్రీపాల్, రాజు, గ్రామపెద్దలు జగపతి, ఓంకార్, పోచయ్య, ఏఎన్ఎం సావిత్రి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏడుపాయల్లో టెండర్ల వాయిదా

పాపన్నపేట, జనవరి 3: వనదుర్గా సన్నిధిలో ఏడుపాయల జాతరలో తలనీలాలు, టెంట్‌హౌజ్, కొబ్బరి ముక్కలకు బుధవారం ఆలయ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగాల్సిన టెండర్లు వాయిదాపడినట్లు ఈవో వెంకట కిషన్‌రావు పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివరాజ్ హాజరైన టెండర్ ప్రక్రియలో పాటదారులు పాల్గొన్నప్పటికీ గత సంవత్సరం కంటే తక్కువ ఆదాయానికి వేలంపాడటం మూలంగా వాయిదా వేస్తున్నట్లు ఈవో తెలిపారు. త్వరలోనే తిరిగి వేలం నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మాజీ జడ్పీటీసీ మామిళ్ల ఆంజనేయులు

హవేళీఘణపూర్, జనవరి 3: రాజిపేట గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో ఐదు పూరిళ్లు కాలిపోయి వీధిన పడ్డ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ జడ్పీటీసీ మామిళ్ల ఆంజనేయులు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వారి పరిస్థితి ప్రస్తుతం తలదాచుకునేందుకు ఏ దిక్కూ లేదని, ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నెలకు కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులతో పాటు బట్టలను పంపిణీ చేయాలన్నారు. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

హవేళీఘణపూర్, జనవరి 3: బుధవారం మండలపరిధిలోని బ్యాతోల్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు ఇచ్చినట్లు అసిస్టెంట్ డాక్టర్ సలావొద్దీన్ తెలిపారు. పాడిరైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించాలని సూచించారు.

బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌కు వీడ్కోలు పలికిన ఎంపీపీ



మెదక్ కలెక్టరేట్‌లో బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి వీడ్కోలు పలుకుతున్న ఎంపీపీ పద్మానర్సింహారెడ్డి

కౌడిపల్లి, జనవరి 3: బదిలీపై వెళ్తున్న మెదక్ కలెక్టర్ భారతిహోళికేరికి కౌడిపల్లి ఎంపీపీ అధ్యక్షురాలు చిలుముల పద్మానర్సింహ్మారెడ్డి వీడ్కోలు పలికారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌కు వెళ్లిన ఎంపీపీ పద్మానర్సింహ్మారెడ్డి కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సేవలను ఎంపీపీ పద్మానర్సింహ్మారెడ్డి కొనియాడారు.

'ఆ రెండు గ్రామాల్లో చెదరని ముద్ర వేసిన కలెక్టర్'

కౌడిపల్లి, జనవరి 3: కౌడిపల్లి మండలంలోని భుజరంపేట్, మహ్మద్‌నగర్ రెండు గ్రామాల్లో కలెక్టర్ భారతిహోళికేరి చెదరని ముద్ర వేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమాలు ముమ్మరం చేసి ఆ రెండు గ్రామాలను, నూరుశాతం సంపూర్ణ పారిశుధ్యం సాధించుటలో అహర్నిశలు పాటు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన స్వచ్ఛ ఉన్నత అభియాన్ గ్రామ పంచాయితీగా భుజరంపేట్ గ్రామం గుర్తించి జిల్లా కలెక్టర్ భారతిహోళికేరికి ఢిల్లీలో ఉన్నతమైన పురస్కారాన్ని ఆమె సొంతం చేసుకున్నారు. అదేవిధంగా మహ్మద్‌నగర్ పంచాయతీని సైతం అవార్డు దిశగా మళ్లించుటలో ప్రత్యేక దృష్టి పెట్టి మూడు నెలల్లోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా నిరంతరం కృషి చేసిన ఘనత ఆమెకే దక్కుతుంది. ఆమె బదిలీ కావడం జీర్ణించుకోలేకపోతున్నామని సర్పంచులు కిష్టమ్మ దివ్యమహిపాల్‌రెడ్డి, పార్టీల నాయకులు, ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు

శివ్వంపేట, జనవరి 3: మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర పరిశీలకులు సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకుడు ఎస్‌ఆర్‌జీ కమల్‌సింగ్, నర్సింహ్మారెడ్డిలు పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి పదో తరగతి ఫలితాలపై ఆరా తీశారు. విద్యార్థులకు త్రీఆర్‌పై శిక్షణ పనితీరును పరిశీలించారు. వీరి వెంట ఎంఈవో బుచ్యానాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం నారాయణమ్మ, ఉపాధ్యాయులు సాంబయ్య, రమేశ్, వేణుగోపాల్‌గౌడ్, నర్సాగౌడ్, దేవీశ్రీ, పద్మ, మంజుల, సీఆర్పీలు ఉన్నారు.

'సావిత్రీబాయి పూలే జయంతిని

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి'

నర్సాపూర్‌రూరల్, జనవరి 3: సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సావిత్రిభాయిపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే కృషితోఎంతో మంది మహిళలు చదువు నేర్చుకోగలిగారని కొనియాడారు. యూటీఎఫ్ మండల ఉపాధ్యక్షురాలు ఎన్.మాధవి మాట్లాడుతూ 186 సంవత్సరాలకు పూర్వమే మహిళలకు విద్య అవసరమని భావించిన సావిత్రిభాయిపూలే స్వయంగా మహిళలను చైతన్యం చేశారన్నారు. సావిత్రిభాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు గణేశ్, జయలక్ష్మి, యాస్మీన్, రాజు పాల్గొన్నారు.





నర్సాపూర్‌లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిలప్‌చెడ్‌లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దచింతకుంటలో

మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దామోదర్, పాఠశాల హెచ్‌ఎం గుండం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు దిలీప్‌సింగ్, జయసారమ్మ, రామశేషు, శీలాబాయి, బిహుల్లా, శేఖర్ పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో

చిలప్‌చెడ్, జనవరి 3: మిన్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి సావిత్రిభాయి పూలే అని పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలను నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు మల్లారెడ్డి మాట్లాడుతూ సావిత్రిభాయిపూలే భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని, కుల, మత బేధాలకు అతీతంగా సమాజ ఉద్ధరణకు, స్త్రీ సంక్షేమం కొరకు ఆమె అహర్నిషలు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, యాదవ సంఘం ఉపాధ్యక్షుడు జి.మల్లేశం, మొగులయ్య, శేషాద్రి, రాజశేఖర్ పాల్గొన్నారు.

స్తంభం ఒరిగిపోయినా పట్టించుకోరా?

నర్సాపూర్, జనవరి 3: నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభం ఒకటి పూర్తిగా ఒరిగిపోయి వాహనదారులు ఇబ్బంది పడుతున్నా దానిని మరమ్మత్తు చేయించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నర్సాపూర్ పట్టణంలో ట్రాఫిక్ తీవ్రంగా పెరిగిపోవడంతో పాటు అంబేద్కర్ చౌరస్తా వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ రాజమణిమురళీధర్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా పరిషత్ నిధుల ద్వారా ఏడాది క్రితం ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయించారు. దీంతో వాహనాలు సిగ్నల్స్ లైట్ల ఆధారంగా ఎవరికివారు వాహనాలను చౌరస్తా వద్ద తీసుకెళ్తుండటంతో అక్కడ ప్రమాదాలు పూర్తిగా తగ్గిపోయి వాహనదారులు కూడా ఇబ్బందులు లేవని సంతోషిస్తున్నారు. ఈ క్రమంలో గత కొన్ని నెలల క్రితం గుర్తు తెలియని వాహనం సంగారెడ్డి మార్గంలో ఉన్న ఓ సిగ్నల్ స్తంభాన్ని డీకొనడంతో పూర్తిగా ఒరిగిపోవడంతో పాటు లైట్లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో సిగ్నల్స్ పడినప్పుడు తూప్రాన్ నుంచి సంగారెడ్డి వైపు వెల్లే వాహనదారులకు ఏ లైటు పడిందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా స్తంభం పూర్తిగా ఓ వైపు ఒరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళన కూడా వాహనదారుల్లో వ్యక్తం అవుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా పోలీసులు ఈ సిగ్నల్స్ స్తంభాన్ని బాగు చేయిస్తామని చెబుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల ఇబ్బందులు లేకుండా ఎంతగానో ఉపయోగపడుతున్న సిగ్నల్స్ స్తంభాన్ని బాగు చేయించి ఇక్కట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



ఓ వైపు పూర్తిగా ఒరిగిపోయి ఉన్న సిగ్నల్ స్తంభం

'తూతూ మంత్రంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సమావేశం'

నర్సాపూర్, జనవరి 3: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులకు బుధవారం నిర్వహించిన సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించి వైద్య అధికారులు చేతులు దులుపుకున్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని సర్పంచులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు అందుకు సర్పంచులు అందరూ హాజరు కావాలని సూచించారు. ఇందుకు గాను పలువురు సర్పంచులు సమయానికి రాగా సంబంధిత అధికారులు మాత్రం తాపీగా ఒంటిగంటకు రావడంపై పలువురు సర్పంచులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మమ్మల్ని ఉదయం రమ్మని వారే ఆలస్యంగా వస్తే ఎలా అని వారు విలేకరుల ఎదుట అసంతృప్తి వ్యక్తం చేశారు.

నాసిరకంగా సీసీ రోడ్డు



పైతెరలో సీసీ రోడ్డుపై పగుళ్లు ఏర్పడిన తర్వాత సిమెంటు వేసిన దృశ్యం

కొల్చారం, జనవరి 3: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంది. గ్రామ పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేసిన సీసీ రోడ్డు నిర్మాణం పనులు ఇష్టానుసారంగా జరుగుతున్నాయి. కొల్చారం మండలం పైతెర గ్రామంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న పనులు నాసిరకంగా ఉండటంతో గ్రామస్థులు ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైతెర బీసీ కాలనీలో రోడ్డు వేసిన ఒక్క రోజుకే పగుళ్లు రావడంతో దానిపై మరో దఫా సిమెంటు వేశారు. పనులు జరుగుతుండగా, పంచాయతీ శాఖాధికారులు అందుబాటులో లేకపోవడంతో పనులు నాసిరకంగా జరిగాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో ఇష్టానుసారంగా సీసీ రోడ్డు పనులు జరుపడంపై సర్పంచ్ తీరుపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పంచాయతీ శాఖాధికారి అమ్యాంమ్యాలకు ఆశ పడి సీసీ రోడ్డు పనులు జరుగుతున్నప్పుడు పనులు పరిశీలించడం లేదని పలువురు గ్రామస్థులు అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బురదమయమైన పాఠశాల మైదానం

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ట్యాంకు వద్ద లీకేజీ అవుతున్న నీరు



బురదమయంగా పాఠశాల మైదానం

నర్సాపూర్‌రూరల్, జనవరి 3: నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం బురదమయం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో వాటర్ ట్యాంక్ ఉంది. ట్యాంక్ వద్ద పైపులైన్ లీకేజీ కావడంతో ఆ నీరు పాఠశాల మైదానంలోకి వస్తుంది. దీంతో మైదానం పూర్తిగా బురదమయం కావడంతో ఆటలు ఆడలేకపోతున్నామని, బురదతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని, ట్యాంక్ వద్ద నీరు వెళ్లేలా కాల్వను నిర్మించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు

తూప్రాన్, జనవరి 3: తూప్రాన్ పట్టణం లోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం క్రాంతిజ్యోతి సావిత్రీబాయి పూలే 187వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి జయంతి వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీదేవిని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా కార్యదర్శి చిన్నలింగ్ మల్లికార్జున్‌గౌడ్, టీఆర్‌ఎస్ నాయకులు కొట్టంల ఉపేందర్, సిందె చంద్రం, వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తూప్రాన్ హైస్కూల్‌లో సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూలే జయంతి వేడుకలను మండల పరిధి లోని మక్కరాజ్‌పేట పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్రవర్ణ ఆధిపత్యం కొనసాగుతున్న తరుణంలోనే ఒక మహిళా ఉపాధ్యాయురాలుగా ఎలాంటి బెదిరింపులకు లొంగకుండా ఎంతో మందికి విద్యాదానం చేసిన సమర్థవంతురాలు సావిత్రీబాయి పూలే అని పొగిడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్ల లక్ష్మణ్, శ్రీధర్ రెడ్డి, కృష్ణ, ప్రభాకర్, లతీఫా, వీణా, వెంకట్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నార్సింగి మండలంలో

నార్సింగి(చేగుంట), జనవరి 3: సావిత్రీబాయి పూలే 187వ జయంతి వేడుకలను మండలకేంద్రమైన నార్సింగిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నార్సింగిలోని సాహితీ విద్యాలయంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సవిత్రీబాయి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీ విద్యాలయ కరస్పాండెంట్ వేణుగోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ బాలరాజు, అందంరెడ్డి, కవి రాములు, చారి, తదితరులు పాల్గొన్నారు.

చేగుంట మండలంలో

చేగుంట, జనవరి 3: భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి



మక్కరాజ్‌పేట పాఠశాలలో సావిత్రీబాయిపూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

చెక్కు అందజేత

నార్సింగి(చేగుంట), జనవరి 3: అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయిన బాధితుడికి నార్సింగి తహసీల్దార్ కృష్ణవేణి బుధవారం చెక్కును అందజేశారు. నార్సింగికి చెందిన పత్రి యాదయ్య నివాస పూరిగుడిసె నెలరోజుల క్రితం ప్రమాదవశాత్తు కాలిపోగా ఆస్తినష్టం జరిగింది. బాధిత కుటుంబానికి రూ. 4,100 చెక్కును తహసీల్దార్ కృష్ణవేణి అందజేశారు. ఈకార్యక్రమంలో వీఆర్వో కిషన్ పాల్గొన్నారు

లక్ష్మీనర్సమ్మకు సన్మానం

చేగుంట, జనవరి 3: సావిత్రీబాయి పూలే ప్రజాసంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మను బుధవారం ఘనంగా సన్మానించారు. వరంగల్ జిల్లా హన్మకొండలోని అంబేద్కర్ భవన ఆడిటోరియంలో మండల ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మను ఘనంగా సన్మానించారు. ప్రజాసంక్షేమసంఘం అధ్యక్షుడు చేకూరి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు జంపాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సన్మానించారు.

భూముల పరిశీలన

తూప్రాన్ రూరల్, జనవరి 3: కాళేశ్వరం ప్రాజెక్టు కాలువలను నిర్మించేందుకు అవసరమైన భూములను పరిశీలించేందుకు ప్రాజెక్టు ఇంజనీరింగు అధికారులు గురువారం వస్తున్నట్లు తహసీల్దారు నజీబ్ అహ్మద్ తెలిపారు. భూములను కోల్పోతున్న రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు.

ఎమ్మార్పీఎస్ ఆందోళన

తూప్రాన్, జనవరి 3: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంద కృష్ణమాదిగ చేపట్టిన దీక్షను భగ్నం చేసి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆందోళన చేపట్టింది. మంద కృష్ణ మాదిగను బేషరతుగా విడుదల చేయాలని తహసీల్దారు కార్యాలయ డిప్యూటీ తహసీల్దారు ఆర్జునకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గజ్జెలభిక్షపతి, గజ్జెల రాములు, కాలకంటి దుర్గయ్య తదితరులున్నారు.

'అభివృద్ధి పనులకు ఇసుక రవాణాను అడ్డుకోవద్దు'

వెల్దుర్తి, జనవరి 3: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు తరలించే ఇసుకకు గ్రామాల్లోని రైతులు, ప్రజలు అడ్డుపడవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వెల్దుర్తి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యేకు పంతుల్‌పల్లి రైతులు మొరపెట్టుకున్నారు. ఇసుకను ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా తరలించడం వల్ల తమ వ్యవసాయ పొలాల కోసం వేసుకున్న పైపులైన్లు ధ్వంసమై సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వమని, ఏమైనా పైపులు ధ్వంసమైతే సంబంధిత కాంట్రాక్టర్లచే మరమ్మతులు చేయిస్తామని సూచించారు. అభివృద్ధి పనులకు అనుమతి ద్వారానే ఇసుక తరలిస్తారని ఎవరూ అడ్డుకోవద్దని సూచించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 500 డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వెల్దుర్తి, కొల్చారం మండలాల నుంచి ఇసుకను తరలిస్తున్నామని తెలిపారు. పంతుల్‌పల్లి గ్రామాభివృద్ధి కోసం రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తలందరికీ పనులు కల్పిస్తామని తెలిపారు. వెల్దుర్తిలో 85 డబుల్‌బెడ్‌రూం నిర్మాణ పనులు జరుగుతుండగా అందులో 39 వరకు నిర్మాణం పూర్తి కాగా 46 నిర్మాణదశలో ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. పనులు నాణ్యతతో నిర్మిస్తున్నారన్నారు. ఇళ్లులేని కార్యకర్తలకు, అర్హులైన నిరుపేదలకు సైతం డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

'సేంద్రియ వ్యవసాయంతో రైతులకు లాభాలు'

చేగుంట, జనవరి 3: సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు మంచి లాభాలు వస్తాయని మండల వ్యవసాయాధికారి చైతన్య తెలిపారు. మండలంలోని అనంతసాగర్ గ్రామంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి కృషి వికాస్ యోజన కార్యక్రమంలో రైతులకు సేంద్రియ ఎరువులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మండలానికి ఒక గ్రామం చొప్పున ప్రధానమంత్రి కృషి వికాస్ యోజన పథకం కింద ఎంపిక చేయగా అనంసాగర్‌లోని రైతులు ముందుకు వచ్చినట్లు తెలిపారు. సేంద్రియ వ్యవసాయం చేయడానికి ముందుకు వచ్చిన రైతులకు వేపపూతతో కూడిన ఎరువులను ఉచితంగా పంపిణీ చేశారు. అదే విధంగా వరినారుమళ్లను కషాయంలో ముంచి నాట్లు వేయడానికి సిద్ధం చేశారు. సేంద్రియ వ్యవసాయాన్ని పూర్తిస్థాయిలో చేసే రైతులకు ప్రభుత్వ పక్షాన ప్రోత్సాహకాలు అందించనున్నట్లు వ్యవసాయాధికారి చైతన్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు మాధవి, ప్రవీణ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



సేంద్రియ ఎరువులను మిక్సింగ్ చేస్తున్న అధికారులు

పట్టాభూముల్లో ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలి

ఘనపూర్ గ్రామసభలో తీర్మానం

తూప్రాన్, జనవరి 3: గ్రామంలో కొన్నేళ్ల క్రితం పట్టా భూముల్లో నిర్మించుకున్న ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలని ఘనపూర్‌లో జరిగిన గ్రామసభలో తీర్మానించారు. మండలంలోని ఘనపూర్‌లో సర్పంచ్ తాడేపు శంకర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో కొన్నేళ్ల క్రితం పేదలు పట్టాభూముల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. సాధారణమాలపై కొనుగోలు చేసిన ఆ భూములకు రెగ్యులరైజ్ చేస్తు, ఇళ్లకు నంబర్లు కేటాయించాలని తీర్మానం చేశారు. ఇందులో జడ్పీటీసీ సుమనవిజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ స్వామి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచు మైసయ్య తదితరులు పాల్గొన్నారు.



ఘనపూర్‌లో గ్రామసభను నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ నియామకంపై హర్షం

తూప్రాన్, జనవరి3: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను నియమించడంపై నాచారం ట్రస్టు బోర్డు డైరక్టర్ మామిడి వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను చైర్మన్‌గా ఎన్నిక చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఇందులో టీఆర్‌ఎస్ నాయకులు సామల అశోక్, మన్నె శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, సత్యలింగంలు పాల్గొన్నారు.

'పనులను పూర్తి చేయాలి'

మనోహరాబాద్(తూప్రాన్), జనవరి 3: మనోహరాబాద్ మండల కేంద్రంలో మిషన్‌భగీరథ పనులు, డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బుధవారం నిర్వహించిన గ్రామసభలో తీర్మానించారు. మనోహరాబాద్‌లో భగీరథ పనులు పూర్తికాకపోవడంతో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, పనులు పూర్తి చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని తీర్మానం చేశారు. లింగారెడ్డిపేటలో సర్పంచ్ సుగుణమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో సీసీ రోడ్డు, వీధి దీపాలు, ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని తీర్మానం చేశారు.

ఎమ్మార్పీఎస్ యువసేన జిల్లా కన్వీనర్‌గా హరిప్రసాద్

చేగుంట, జనవరి 3: ఎమ్మార్పీఎస్ యువసేన జిల్లా కన్వీనర్‌గా బాలసాయి హరిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. మెదక్‌జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ యువసేన సమావేశంలో మెదక్ జిల్లా కన్వీనర్‌గా పోతాన్‌పల్లికి చెందిన బాలసాయి హరిప్రసాద్‌ను ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర కార్యదర్శి లద్దె నర్సింలు, రాష్ట్ర నాయకుడు పుర్రప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో మండలానికి చెందిన ఎర్రయాదగిరి, మైలారం రాంచంద్రం, కొల్బుల స్వామిలకు స్థానం లభించింది.

పోస్టర్ ఆవిష్కరణ

చేగుంట, జనవరి 3: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజకీయ శిక్షణా తరగతుల పోస్టర్‌ను చేగుంటలో బుధవారం ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తలకు ఈనెల 6,7 తేదీల్లో నల్లొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌లో శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణం తనిఖీ

చేగుంట, జనవరి 3: మండలంలోని బోనాల గ్రామంలోని ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి చైతన్య బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణంలోని మందుల వివరాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. పీవోఎస్ యంత్రాల ద్వారా అమ్మకాలు చేస్తున్న విషయాన్ని యజమాని వ్యవసాయాధికారి దృష్టికి తీసుకురాగా వివరాలను నమోదు చేసుకున్నారు.

భూ మాయాజాలం



- భూముల కొనుగోలులో అప్రమత్తత తప్పనిసరి
- పరిశీలనే ముఖ్యం
- అప్రమత్తతే ఆయుధం

మర్కుక్, జనవరి 3: నివసించేందుకు ఓ ఇల్లు. వృద్ధాప్యంలో ఆసరా కోసం ఓ ఎకరం భూమి ఉండాలనేది ప్రస్తుతం సమాజంలోని సామాన్యుడి కోరిక. చాలీ చాలని వేతనంలో కొంత దాచుకుని చాలా మంది సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నారు. అలాగే ఎంతో కొంత భూమిని కొనుక్కోవాలని ప్రయత్నిస్తారు. తీరా ఆ స్థలం కొన్నాక అది ప్రభుత్వ భూమి లేక పేదలకు కేటాయించిన భూమి అని తెలిసి మోసపోతున్నారు. లక్షలు పెట్టి కొన్న తర్వాత అటు భూమి దక్కగా, ఇటు న్యాయస్థానాల చుట్టూ తిరుగలేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నవారు. జిల్లాలో ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదుల్లో అధిక శాతం భూ సమస్యలపైనే వస్తున్నాయి. అందుకే భూ మోసాలను అరికట్టి సామాన్య ప్రజల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం భూ ప్రక్షాళన చేపట్టింది. అయితే భూములకు సంబంధించిన వివరాలపై అవగాహన కలిగి ఉంటే మోసపోకుండా ఉండే వీలుంది. అందుకే భూములకు సంబంధించిన వివిధ దస్త్రాల వివరాలు మీకోసం..

ఈ తొమ్మిది రికార్డులే కీలకం

జిల్లాలో భూములు వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నాయి. జిల్లా నుంచే హైదరాబాద్‌కు పూర్తి స్థాయిలో కూరగాయలు ఎగుమతి చేస్తారు. జిల్లా నుంచి ఎక్కువగా సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ తదితర నియోజకవర్గాల పరిధిలో ప్రతి నిత్యం వందల సంఖ్యలో వాహనాల్లో హైదరాబాద్‌కు కూరగాయలు తీసుకెళ్తారు. అలాగే సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల పట్టణాల్లో ఇళ్ల స్థలాల ధరలు అంబరాన్నంటాయి. పట్టణానికి దగ్గరగా ఉండడం వల్ల వ్యవసాయ భూమి ఎకరాకు రూ. 20లక్షల నుంచి రూ. కోటి 50లక్షల వరకు పలుకుతోంది. నివాస స్థలం గజానికి పట్టణాల్లో రూ. 10వేల నుంచి రూ. 60వేల వరకు ఉంది. పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో క్రయ విక్రయాలు తగ్గినా.. విలువలు మాత్రం అదే స్థాయిలో ఉన్నాయి. ఈ అనుకూలతను ఆసరాగా చేసుకుంటున్న కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. చాలా సందర్భాల్లో కొనుగోలుదారులకు రెవెన్యూ రికార్డుపై కనీస అవగాహన లేకపోవడంతో చివరకు దళారుల చేతుల్లో మోసపోతున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ తొమ్మిది రకాల రికార్డులపై అవగాహన కలిగి ఉంటే భూ మాయాజాలం నుంచి తప్పించుకోవచ్చు.



సేత్వార్

రికార్డులను పరిశీలించే క్రమంలో ముందుగా ప్రధానమైనది సేత్వార్. ఈ రికార్డులో ఒక సర్వే నంబర్‌లోని భూమి అనుభవదారు లేదా ఖాతాదారుడిగా ఒక వ్యక్తి పేరు నమోదై ఉంటే అది పట్టాభూమి అని దీనిని కొనుగోలు చేయొచ్చు. ఒకవేళ వర్గీకరణలో గైరాన్, ప్రభుత్వం, పోరంబోకు, బంచరాయి, శిఖంగా నమోదైతే దీనిని ప్రభుత్వ భూమిగా పరిగణించాల్సి ఉంటుంది. సేత్వార్‌లో ఉన్న అన్ని వివరాలు దాదాపుగా ఖాస్రా పహణీలో ఉంటాయి.

ఖాస్రాపహణీ (1954-55):

ఖాస్రా ఖాతాలో భూమి ఈనాం అయితే దానిని కొనుగోలు చేయాలంటే ఆర్డీవో ఇచ్చిన భూస్వాధీన హక్కు పత్రం తప్పనిసరి.

రక్షణ కేవల్‌దార్ రిజిస్టర్(1951-52):

మనం కొనుగోలు చేసే భూమిలో ఎవరైనా రక్షిత కౌలుదారు ఉన్నట్లు తెలుసుకోవాలంటే రక్షిత కౌలుదారు రిజిస్టర్‌ను, 1951-52ను పరిశీలించాలి.

సీలింగ్ రిజిస్టర్

ఎవరి పేరైనా సీలింగ్ భూమిలో నమోదై ఉంటే, సదరు పట్టాభూమి విస్తీర్ణంలో యజమానికి 60శాతం, కౌలుదారుకు 40శాతం హక్కు ఉంటుంది.

ఆర్ఓఆర్ పహణీ

భూమి ఆర్వోఆర్ ద్వారా మార్పిడి జరిగినట్లయితే ఎవరి నుంచి ఎంత కొనుగోలు చేయాలో తెలుసుకుంటే వివాదాల బారిన పడకుండా ఉంటాము.

ఆర్వోఆర్ అనంతరం పహణీ

ఆర్వోఆర్ అయిన పిదప భూ గరిష్ఠ పరిమితికి మించి ఉన్న మిగులు భూముల వివరాలను సీలింగ్ రిజిస్టర్‌లో పొందుపరుస్తారు. భూమి కొనుగోలు చేసిన సర్వే నంబర్ ఇందులో ఉంటే ఆ సంఖ్యలోని ఎంత విస్తీర్ణం ప్రభుత్వానికి ఇచ్చారో తెలుసుకోవాలి. సీలింగ్ భూమిని నిబంధనల ప్రకారం కొనుగోలు చేయకూడదు.

ప్రస్తుత సంవత్సర పహణీ

ఆర్వోఆర్ పూర్తయిన తర్వాత ప్రస్తుత సంవత్సరం కొత్త పహణీని పరిశీలించాలి. అందులో పట్టాదార్ కాలమ్‌లో పేరు నమోదై ఉందా లేదా తెలుసుకోవాలి. ఆర్వోఆర్‌తో పాటు మిగతా పహణీల్లో ఒక భూమికి సంబంధించి పట్టాదారు, అనుభవదారు రెండూ ఒకే వ్యక్తి ఉండాలి. వేర్వేరు ఉన్నట్లయితే అలా ఎందుకు వచ్చిందో ఆరా తీయాలి.


22(ఎ) రిజిస్టర్

స్టాంప్‌ల రిజిస్ట్రేషన్ చట్టం- 1908లోని 22(ఎ) సెక్షన్ ప్రకారం నిషేధిత జాబితాలో భూములు ఉంటే వాటిని కొనుగోలు చేయకూడదు. ప్రభుత్వ భూములతో పాటు ప్రభుత్వ అవసరాల కోసం సేకరించిన భూములు, పేదలకు కేటాయించిన భూములు ఇందులో పొందు పరుస్తారు.

ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్(ఈసీ):

ఒక సర్వే సంఖ్యలోని భూమికి సంబంధించిన క్రయ విక్రయాలు, పూర్తి వివరాలు ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్(ఈసీ) ద్వారా తెలుసుకోవచ్చు. మీసేవా కేంద్రాల్లో వీటిని పొందవచ్చు. చట్ట ప్రకారం కొనుగోలు చేస్తే ఆయా వివరాలు ఈసీలో నమోదవుతాయి.

అప్రమత్తతతో కొనుగోలు చేయాలి



భూమి కొనుగోలు చసేటప్పుడు వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. ఖాస్రా పహణీతో పాటు ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాకే భూమిని కొనుగోలు చేయాలి. ప్రస్తుతం రెవెన్యూ సర్వే పూర్తయితే భూములకు సంబంధించి గతం కంటే మెరుగైన రికార్డులు అందుబాటులోకి రానున్నాయి. సేత్వార్, ఖాస్రా పహణీతో పాటు అందుబాటులో ఉన్న పాత రికార్డు, ఆన్‌లైన్ పహణీ, సర్వే నంబర్ల రిజిస్టర్, 1బీ రిజిస్టర్ వంటి వాటిని పరిశీలించుకోవాలి. కొనుగోలుదారులు సంబంధిత రెవెన్యూ అధికారుల వద్ద వివరాలు పరిశీలించాకే కొనుగోలు చేస్తే ఇబ్బందులు ఉండవు.

– రవీందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు,

ఆత్మ పనితీరు అంతంతమాత్రమే!

- అన్నదాతలకు అవగాహన కల్పించడంలో విఫలం
- ఉత్తమ రైతులకు ప్రోత్సాహం కరువు
- సిబ్బంది నియామకంలోనూ నిర్లక్ష్యం

దుబ్బాక: జిల్లాలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) రైతులకు అవగాహన కార్యక్రమాలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నదనే ఆరోపణలున్నాయి. తగిన నిధులను కేటాయించాల్సిన ప్రభుత్వం వాటిని విస్మరించడంతో వీటి వల్ల రైతులకు ఉపయోగం చేకూరడంలేదు. సిద్దిపేట జిల్లాలో ఐదు ఏడీఏ కార్యాలయాలున్నాయి. కానీ వీటి పరిధిలో కేవలం మూడు కమిటీలను మాత్రమే నియమించారు. సీఎం నియోజకవర్గం గజ్వేల్, ములుగు ఏడీఏ పరిధిలో కమిటీల నియామకం చేపట్టలేదు. నియమించిన చోట కూడా ఆత్మకమిటీల పనితీరు అంతంతమాత్రమే. ప్రభుత్వం ఇప్పటి వరకు జిల్లాకు రూ. 30 లక్షల నిధులు విడుదల చేయాల్సి ఉండగా, కేవలం రూ. 8లక్షలు మాత్రమే విడుదల చేసింది. రెండేళ్లుగా నిధులు సక్రమంగాఅందకపోవడంతో సకాలంలో రైతులకు అందించాల్సిన సాంకేతిక పరిజ్ఞానం అందడంలేదు.



ఆత్మ డివిజన్ కార్యాలయం

తూతూ మంత్రంగానే కార్యక్రమాలు

జిల్లాలోని ఐదు ఏడీఏ కార్యాలయాల పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలను తూతూ మంత్రంగానే కానిచ్చేశారు. రైతులను వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి కొత్త వంగడాలను, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలి. ఇందుకోసం రైతుల ఎంపిక కూడా రాజకీయ కోణం నుంచే సాగుతున్నదనే విమర్శలు లేకపోలేవు. రైతుల క్షేత్ర పర్యటనల కోసం ఇప్పటివరకు రూ. 2లక్షల 61వేలు వెచ్చించినా సామాన్యరౌతుకు ప్రయోజనం లేదు. మూడు వందల మందిని క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్లినట్లుగా అధికారులు తెలుపుతున్నారు.

ఉత్తమ రైతులకు ప్రోత్సాహం కరువు

ఏటా ఉత్తమ రైతులను ఎంపిక చేసి అవార్డులను అందించాలి. కానీ ఇంతవరకు ఎంపిక ప్రక్రియ కూడా చేపట్టలేదు. నూతన పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడిని సాధిస్తున్న రైతులకు ప్రోత్సాహం కూడా అందించడంలేదు. బిందు సేద్యం ద్వారా వరి సాగు చేస్తున్న దుబ్బాక మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన మోనగారి రమేష్‌ను రాష్ట్ర స్థాయి అధికారులు అభినందించినప్పటికీ, ప్రభుత్వ ప్రోత్సాహం శూన్యంగానే మిగిలింది. శ్రీవరి ద్వారా నాలుగేండ్లుగా అధిక దిగుబడి సాధిస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ కట్కూరి రాంచంద్రాన్ని కనీసం క్షేత్ర పర్యటనలకు తీసుకెళ్లిన దాఖలాలు లేవు. ఇలా అన్ని గ్రామాల్లో అధిక దిగుబడులు సాధించే రైతులకు క్షేత్రస్థాయి పర్యటనలు, ఈనామ్ సదస్సులు, రైతు శిక్షణలు, బ్లాక్‌లెవల్ సమావేశాలు, పామ్‌స్కూల్ అవగాహనలు, రైతు విజ్ఞాన యాత్రలు నిర్వహించలేదు. ఏటా కొంతమంది సన్నకారు రైతులను ఎంపిక చేసి వారికి ఎరువులు, పురుగుల మందులు, సేంద్రియ ఎరువులను అందించాలి. రూ. 1,300 రాయితీ కల్పించాలి. కానీ ఈ రాయితీ కూడా అర్హులకు అందడంలేదు.



సిబ్బంది కొరత

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన సిబ్బంది కొరత జిల్లాను పట్టి పీడిస్తున్నది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సిబ్బందిని నియమించారు. కానీ సిద్దిపేట జిల్లాలో మాత్రం నియమాకానికి గ్రహణం పట్టింది. ఇద్దరు బ్లాక్‌లెవల్ టెక్నికల్ మెనేజర్లు, మరో తొమ్మిది మంది అసిస్టెంట్ టెక్నికల్ మెనేజర్ల నియామకం పెండింగ్‌లో ఉంది. ఇక సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలు రావడంలేదు.

దంచినా, రుబ్బినా.. ఎంతోమేలు!

- పిండి రుబ్బితే పరిపూర్ణ వ్యాయామం
- వంటకాల రుచులే వేరు
- గ్రామాల్లో ఇప్పటికీ వాడకం.. అందుకే రోగాలకు దూరం
- పట్టణాలలో శుభ కార్యాలకే పరిమితమైన ఇసుర్రాళ్లు

మా అమ్మ చేసే పచ్చడి రుచి అమృతంలా ఉండేదని ఇప్పటి నాన్నలు తన పిల్లలతో చెప్తుంటారు.. కొందరు బామ్మలు వృద్ధాప్యంలోనూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు.. ఎందుకంటే గతంలో అందరు తల్లులు పిండి రుబ్బడానికి రుబ్బురోళ్లను, పిండి దంచడానికి రోలు, రోకలిని వాడేవారు. అందుకే వంటలు ఎంతో రుచిగా ఉండేవి. అంతేకాదు ఏ వ్యాయామం చేయకుండానే మహిళలు ఆరోగ్యంగా ఉండేవారు.



ఇసురరాయిలో వేసి పప్పును ఇసురుతున్న లక్ష్మి

గుమ్మడిదల: రోలు, రుబ్బురోలు, ఇసుర్రాయి వీటి పేర్లు ఈ తరం పిల్లలకు కొంతమందికే తెలుసు. గతంలో ఇవి ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఉండేవి. ప్రస్తుతం మహిళలు వీటిని ఉపయోగించడం చాలా అరుదు. ఎందుకంటే వీటి బదులుగా మార్కెట్‌లో మిక్సీలు, గ్రైండర్లు లభిస్తున్నాయి. వీటిని ఉపయోగించి శారీరక శ్రమలేకుండా పనిని సులభంగా పూర్తి చేస్తున్నారు. ఒకప్పుడు గారెల పిండిని రుబ్బురోలుతో రుబ్బేవాళ్లు. ఇప్పుడు గ్రైండర్‌లో వేసి స్విచ్ ఆన్ చేస్తున్నారు. దోషల పిండి కోసం రోలును ఉపయోగించేవారు. ఈ ఆధునిక యుగంలో మిక్సీని వాడుతున్నారు. కానీ కొన్ని మారుమూల గ్రామాల్లో మాత్రం రోలు, రుబ్బురోలు, ఇసుర్రాయి నేటికీ వాడుకలో ఉన్నాయి. వీటితో రుబ్బిన పిండితో చేసిన వంటల రుచి గ్రైండర్ పిండితో చేసిన వంటకాల కంటే ఎంతో మెరుగ్గా ఉంటుందంటున్నారు పెద్దలు. గతంలో మహిళలు వంట చేసిన తర్వాత మరుసటి రోజు కోసం రోలు, రుబ్బురోలు, ఇసుర్రాయితో కుస్తీ పట్టి పిండి సిద్ధం చేసేవారు. ఆ రోజుల్లో మహిళలు ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా వ్యాయామం చేసేవారు కాదు. ఎందుకంటే వీటితో గంట పని చేస్తే అదే వ్యాయామం. పూర్వపు రోజుల్లో వడ్లను రోకలితో దంచి బియ్యాన్ని తీసేవారు. అంతేకాదు పసువు, ధనియాల పొడి.. ఒక్కటేమిటి అన్ని పొడులను మహిళలే సమకూర్చుకునేవారు. కానీ ఇప్పుడు ఆధునిక పరికరాలు మహిళల బారాన్ని తగ్గించాయి. దీంతో పాటు అనారోగ్య సమస్యలను తెచ్చిపెట్టాయి. అందుకే పొద్దున లేవగానే వ్యాయామాలు చేస్తూ అనేక పాట్లు పడాల్సి వస్తుంది. పట్టణాల్లో రోలు, ఇసుర్రాళ్లు శుభకార్యాల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. పాత పనిముట్లను ఉపయోగిస్తే ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం అవసరం లేదని కొందరు వైద్యులు చెబుతున్నారు. వీటిని ఉపయోగిస్తే శరీరంలోని అనవసర కొవ్వులు కరిగిపోయి ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు సూచిస్తున్నారు.



రోలులో వడ్లను దంచుతున్న నవనీత, కలమ్మ



రోలులో మిరప పచ్చడి చేస్తున్న పద్మ



అతుక్కుపోతే అంతే!

- పుస్తకాల పురుగులూ.. మీ కళ్లు జర జాగ్రత్త
- రెప్పవాల్చకుండా చదివితే అనర్థాలు తప్పవంటున్న నిపుణులు
- కంటికి పుస్తకానికి మధ్య అడుగు దూరం తప్పని సరి

అక్కన్నపేట, జనవరి 3: పరీక్షలకు సిద్ధమవుతున్నారా? రెప్ప వాల్చకుండా చదివేస్తున్నారా.. విద్యార్థులు జర భద్రం. విశ్రాంతి లేకుండా అదే పనిగా చదువులో మునిగితే కళ్లకు ప్రమాదమంటున్నారు నేత్ర వైద్య నిపుణులు. ఇందు కోసం పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పుస్తకాలతో కుస్తీ

పరీక్షల సీజన్ కావడంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాత్రి 12 గంటల దాకా అదే పనిగా చదివేస్తున్నారు. కానీ రెప్ప వాల్చకుండా చదువుతుంటే కంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని నేత్ర వైద్యులు హెచ్చరిస్తున్నారు.



40శాతం మందికి సమస్యలు

చాలా మంది విద్యార్థులు చదువుకునేటప్పుడు ఎలాంటి జగ్రత్తలు తీసుకోవడంలేదు. ఫలితంగా చిన్న వయస్సులోనే కంటి సమస్యలు, తలనొప్పి బారిన పడుతున్నారు. దాదాపు 40శాతం మంది కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని ఓ అధ్యయనంలో తేలింది. తమ వద్దకు వచ్చే ప్రతి పది మంది పిల్లల్లో నలుగురికి పైగా కంటి సమస్యలున్న వారేనని నేత్ర వైద్యులు పేర్కొంటున్నారు. చాలా మంది విద్యార్థులు కంటికి విశ్రాంతి ఇవ్వడం లేదని, దీనివల్ల పలు సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని వారు హెచ్చరిస్తున్నారు.

అచ్చు సక్రమంగా ఉందా?

పాఠ్యపుస్తకాల్లో అక్షరాలు సక్రమంగా ముద్రించికపోతే కళ్లపై ఒత్తిడి పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో తగినంత రక్తం లేక పోయినా నేత్రాలపైనే ప్రభావం చూపుతుందంటున్నారు. ప్రతి విద్యార్థి చదివేటప్పుడు 30 నిమిషాలకోమారు విశ్రాంతి తీసుకోవడం వల్ల కంటి సమస్యల నుంచి భయటపడొచ్చని సూచిస్తున్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా 8 గంటలు నిద్ర పోవాలని లేకపోతే కంటి సమస్యలు తప్పవంటున్నారు. అంతే కాకుండా ఏడాదికి ఒక్కసారి పిల్లల నేత్రాలను తప్పనిసరిగా పరీక్షించుకోవాలని సూచిస్తున్నారు. పౌషకాహర లోపం వల్ల కూడా దృష్టి మందగిస్తుందని స్పష్టం చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- కంటికి, పుస్తకానికి మధ్య కనీసం అడుగు దూరం ఉండాలి.
- వెలుతురు సరిగ్గా లేని గదుల్లో చదవొద్దు.
- ప్రతి నిమిషానికి 12 నుంచి 15 సార్లు కంటి రెప్పలు కొడుతుండాలి.
- పుస్తకంపై నీడ పడకుండా జాగ్రత్త తీసుకోవాలి
- కళ్లపై కాకుండా పుస్తకం పైనే వెలుతురు ఉండేలా చూసుకోవాలి.
- సరైన క్రమంలో కూర్చుని మాత్రమే చదవవాలి.
- పడుకుని గాని, అటు, ఇటు తిరుగుతూ గాని చదివితే సమస్యలు తప్పవు
- కంప్యూటర్‌లో చదివే వారు చాలా జాగ్రత్త ఉండాలి. స్క్రీన్ బ్రైట్‌నెస్ తక్కువగా పెట్టుకోవాలి. స్క్రీన్ కళ్లకు సుమారు అడుగు దూరంలో ఉండాలి.
- కంటి అద్దాలు తీసి చదవొద్దు.
- పండ్లు, పాలు, ఆకు కూరల్లాంటి పౌష్టికాహారం తీసుకోవాలి.
- నిరంతరం చదవకుండా అప్పుడప్పుడూ కాస్త విశ్రాంతి తీసుకోవాలి.
- ప్రతి ఒక్కరికీ 7 నుంచి 8 గంటల నిద్ర అవసరం.



ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ నూతన అధ్యక్షుడు?

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

1. 2017కి గాను పురుషుల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత?
ఎ) మాగ్నస్ కార్ల్‌సన్(నార్వే)
బి) వ్లాదిమర్ ఫెడోసివ్(రష్యా)
సి) విశ్వనాథన్ ఆనంద్(ఇండియా)
డి) అలెగ్జాండర్ గ్రిషుక్(రష్యా)

2. 2017కి గాను మహిళల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత?
ఎ) జువెన్‌జున్(చైనా)
బి) జుడిత్ పోల్గర్(హంగేరి)
సి) సోఫియా పోల్గర్(హంగేరి)
డి) అనా ఉషెనినా(ఉక్రెయిన్)

3. 2017కి గాను 'రాయల్‌కప్' ఏషియన్ టూర్ టైటిల్ విజేత శివకపూర్. అతడు ఏ క్రీడకు సంబంధించిన వ్యక్తి?
ఎ) షూటింగ్ బి) బిలియర్డ్స్
సి) గోల్ఫ్ డి) జిమ్నాస్టిక్స్

4. గ్లోబ్ సాకర్ అవార్డ్స్-2017 ఉత్తమ సాకర్ ఆటగాడిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) లియోనల్ మెస్సీ బి) క్రిస్టియనా రొనాల్డో
సి) నెయ్‌మార్(బ్రెజిల్) డి) ముల్లర్(జర్మనీ)

5. ఢిల్లీపై గెలుపొంది 2017-18 రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచిన జట్టు?
ఎ) ముంబై బి) గుజరాత్
సి) తమిళనాడు డి) విదర్భ



6. 61వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న వేదిక?
ఎ) లుథియానా(పంజాబ్)
బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) బెంగళూరు(కర్ణాటక)
డి) తిరువనంతపురం(కేరళ)

7. రంజీ ట్రోఫీ ఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించిన రెండో బౌలర్ రజనీస్ గుర్బాని(విదర్భ). అయితే 1972-73లో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్?
ఎ) కళ్యాణ సుందరం(తమిళనాడు)
బి) ఆర్.పి.సింగ్(ఉత్తరప్రదేశ్)
సి) అర్షద్ అయూబ్(హైదరాబాద్)
డి) జవగళ్ శ్రీనాథ్(కర్ణాటక)

8. క్రికెట్ చరిత్రలో తొలిసారిగా నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌ను ఏ రెండు దేశాల మధ్య నిర్వహించారు?
ఎ) ఆస్ట్రేలియా - న్యూజిలాండ్
బి) దక్షిణాఫ్రికా-జింబాబ్వే
సి) దక్షిణాఫ్రికా - న్యూజిలాండ్
డి) వెస్టిండీస్ - జింబాబ్వే

9. 2018 జనవరి 12-16 వరకు 22వ జాతీయ యువజన ఉత్సవాలు ఏ నగరం వేదికగా నిర్వహించనున్నారు?
ఎ) జైపూర్(రాజస్థాన్)
బి) రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్)
సి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
డి) మధురై(తమిళనాడు)

10. 2017 డిసెంబర్ 27-31 వరకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) హైదరాబాద్(తెలంగాణ)
బి) గాంధీనగర్(గుజరాత్)
సి) కొచ్చి(కేరళ) డి) భువనేశ్వర్(ఒడిశా)

11. 2018 జనవరి 13-15 వరకు అంతర్జాతీయ తీపి పదార్థాల ఉత్సవాలకు ఆతిథ్యం ఇవ్వనున్న నగరం?
ఎ) కాకినాడ(ఆంధ్రప్రదేశ్)
బి) నాగ్‌పూర్(మహారాష్ట్ర)
సి) అమరావతి(ఆంధ్రప్రదేశ్)
డి) హైదరాబాద్(తెలంగాణ)

12. 78వ 'ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్-2017' సదస్సును ఎక్కడ నిర్వహించారు?
ఎ) ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్)
బి) జాదవ్‌పూర్ యూనివర్సిటీ(కోల్‌కతా)
సి) షేర్-ఎ-కశ్మీర్ యూనివర్సిటీ(శ్రీనగర్)
డి) బర్కతుల్లా యూనివర్సిటీ(భోపాల్)

13. 2017 డిసెంబర్ 31న బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా దేన్ని ప్రకటించారు?
ఎ) మిజోరాం బి) ఒడిశా
సి) అరుణాచల్‌ప్రదేశ్ డి) బీహార్

14. కూరగాయలకు కనీస మద్దతు ధర ప్రకటించడం ద్వారా ఆ ప్రత్యేకత పొందిన తొలిరాష్ట్రంగా నిలిచింది?
ఎ) పంజాబ్ బి) హర్యానా
సి) నాగాలాండ్ డి) బీహార్

15. ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్‌కు నూతన అధ్యక్షుడు?
ఎ) వినయ్ సహస్రబుద్దే బి) లోకేశ్ చంద్ర
సి) ప్రతిష్టశర్మ డి) నజ్మాహెప్తుల్లా

16. కేంద్ర పునర్వినియోగ ఇంధన వనరుల శాఖ వివరాల ప్రకారం మునిసిపల్ వ్యర్థాల నుంచి తయారవుతున్న విద్యుత్ 65.75 మెగా వాట్స్. మొత్తం విద్యుత్‌లో ఎంత శాతం?
ఎ) 1.6% బి) 0.02% సి) 0.8% డి) 0.6%

17. 2018 మార్చిలో 105వ సైన్స్ కాంగ్రెస్ సమావేశానికి ఆతిథ్యమిస్తున్నది?
ఎ) ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్)
బి) మణిపూర్ యూనివర్సిటీ(ఇంఫాల్)
సి) శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి)
డి) ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ(అహ్మదాబాద్)

18. పాసింజర్ రైళ్లకు ఎప్పటిలోగా బయోటాయ్‌లెట్లను 100% అమర్చాలని కేంద్రం నిర్ణయించింది?
ఎ) 2018 డిసెంబర్ బి) 2019 మార్చి
సి) 2018 జూలై డి) 2022 మార్చి

19. 2017కి గాను PETA పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికైన బాలీవుడ్ నటి అనుష్కశర్మ. PETA ను విస్తరించండి.
ఎ) పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్
బి) ప్రొటెక్షన్ ఎంటాంజిబుల్ యానిమల్స్
సి) ప్రిజర్వేషన్ అండ్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్
డి) పీపుల్ ఫర్ ఎమోషనల్ ట్రాకింగ్ ఆఫ్ యానిమల్స్

20. 2018 జనవరి 12న కార్టోశాట్-2 సహా 31 ఉపగ్రహ ప్రయోగాలకు ఇస్రో ఉపయోగిస్తున్న వాహక నౌక?
ఎ) PSLV-C36 బి) PSLV-C40
సి) PSLV-C342 డి) PSLV-C39

21. 2017 డిసెంబర్ 29న నిర్మలా సీతారామన్ 'సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అపర్చునిటీస్ అండ్ లెర్నింగ్' కేంద్రాన్ని ఎక్కడ ప్రారంభించారు?
ఎ) మంగళూరు(కర్ణాటక)
బి) విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)
సి) ట్యూటికొరిన్(తమిళనాడు)
డి) పనాజి(గోవా)

22. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 సంవత్సరాన్ని ఏ విధంగా ప్రకటించింది?
ఎ) నవతేజ శిశు వికాస సంవత్సరం
బి) విద్యుదీకరణ సంవత్సరం
సి) రైతు సౌభాగ్య సంవత్సరం
డి) తెలుగు అభివృద్ధి సంవత్సరం

23. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కు గాను వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో తొలి మూడు స్థానాలు పొందిన దేశాలు వరుసగా ...
ఎ) స్వీడన్, స్విట్జర్లాండ్, డెన్మార్క్
బి) ఐస్‌లాండ్, నార్వే, ఫిన్లాండ్
సి) స్వీడన్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్
డి) ఫిన్లాండ్, స్వీడన్, నార్వే

24. హిమాచల్‌ప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి?
ఎ) జయప్రకాశ్ నడ్డా బి) ప్రేమ్‌కుమార్ దుమాల్
సి) జైరామ్ ఠాకూర్ డి) సత్పాల్‌సింగ్ సాధి

25. జాతీయ ఇ-గవర్నెన్స్‌లో భాగాంగా చేపట్టిన క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్‌వర్క్ సిస్టం ఆధారంగా 2018 జనవరి 1 నుంచి అన్ని పోలీస్ కార్యకలాపాలను డిజిటలైజ్ చేసిన రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) గోవా సి) గుజరాత్ డి) ఒడిశా

26. 2017 డిసెంబర్ 27న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన ఫైబర్ నెట్ ప్రాజెక్టును ప్రారంభించారు?
ఎ) మధ్యప్రదేశ్ బి) ఆంధ్రప్రదేశ్
సి) బీహార్ డి) తెలంగాణ

27. 2018 జనవరి 1న తెలంగాణ పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన 'TSCOP' యాప్ ద్వారా ఎన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి?
ఎ) 100 బి) 63 సి) 44 డి) 54

28. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఇటీవల ఏ రాష్ట్రంలో ఆరు నెలల పాటు పొడిగించారు?
ఎ) త్రిపుర బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) మేఘాలయ

29. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 700 మెగావాట్ల లక్ష్యంతో పాకిస్థాన్ ప్రభుత్వం 'ఆజాద్ పట్టాన్ జల విద్యుత్ కేంద్రం'ను ఏ నదిపై నిర్మిస్తోంది?
ఎ) సింధు నది బి) జీలం నది
సి) స్వాత్ నది డి) కున్హర నది

30. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కి గాను వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో భారత ర్యాంక్?
ఎ) 90 బి) 163
సి) 106 డి) 123

31. ఆంధ్రప్రదేశ్ నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)?
ఎ) నండూరి సాంబశివరావు
బి) గౌతం సవాంగ్
సి) మాల కొండయ్య
డి) అరవిందరావు



32. లైబీరియా నూతన అధ్యక్షుడు?
ఎ) జార్జి వా
బి) చార్లెస్ టేలర్
సి) ఎలెన్ జాన్సన్ సర్లీఫ్
డి) విలియం టబ్‌మన్



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

33. కేర్‌రేటింగ్స్(క్రెడిట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్)-2017 నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యధిక నిరర్థక ఆస్తులు కలిగిన దేశం గ్రీస్, కాగా భారత్ ర్యాంక్?
ఎ) 18 బి) 35
సి) 14 డి) 5

34. దేశ చరిత్రలో తొలిసారి ప్రపంచ చెస్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రాముఖ్యం పొందిన దేశం?
ఎ) లిబియా బి) ఖతార్
సి) సౌదీ అరేబియా డి) ఘనా

35. 2018 జనవరి 1 నుంచి VAT(వాల్యూ ఆడెడ్ ట్యాక్స్)ను ప్రవేశపెట్టిన దేశాలు?
ఎ) సౌదీ అరేబియా, యుఎఇ బి) కెన్యా, దక్షిణాఫ్రికా
సి) గ్రీస్, వెనిజులా డి) ఇథియోపియా, గ్రీసు

36. 2017 డిసెంబర్ 26న భారత్ ఏ దేశానికి 1 మిలియన్ డాలర్ల మానవతాపరమైన వైద్య సహాయం అందించాలని నిర్ణయించింది?
ఎ) గ్రీసు బి) యెమన్
సి) మయన్మార్ డి) శ్రీలంక

37. జింబాబ్వే నూతన ఉపాధ్యక్షుడు?
ఎ) అబ్దుల్లాహి వర్మాజో బి) ఒమర్-అల్-బషీర్
సి) సెబాస్టియన్ పినెరా డి) కాన్‌స్టాంటిన్ చివేగా

38. మాలి నూతన ప్రధాని?
ఎ) ఇబ్రహిం కేయిత బి) బౌబయ్ మైగా
సి) మిచెల్లి బాచ్‌లెట్ డి) సెబాస్టియన్ పినెరా

సమాధానాలు

1) సి	9) ఎ	17) బి	25) డి	33) డి
2) ఎ	10) బి	18) బి	26) బి	34) సి
3) సి	11) డి	19) ఎ	27) డి	35) ఎ
4) బి	12) బి	20) బి	28) బి	36) బి
5) డి	13) సి	21) ఎ	29) బి	37) డి
6) డి	14) బి	22) డి	30) ఎ	38) బి
7) ఎ	15) ఎ	23) సి	31) సి	
8) బి	16) బి	24) సి	32) ఎ	

నోటిఫికేషన్స్

సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్

బెంగళూరులోని డిఆర్‌డిఒ-సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
జూనియర్ రీసెర్చ్ ఫెలో: 15
విభాగాలు:ఏరోడైనమిక్స్, స్ట్రక్చరల్ డిజైన్ అనాలసిస్, రాడార్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, నెట్‌వర్కింగ్ & డిస్‌ప్లే సిస్టమ్స్, మిషన్ కంప్యూటర్, థర్మల్ మేనేజ్‌మెంట్.
అర్హత:బిఇ/బిటెక్/ఎంఇ/ఎంటెక్(ఎలక్ట్రానిక్స్/ఇసిఇ/ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇఇఇ/సిఎస్ఇ/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ఏరోనాటిక్స్/మెకానికల్ ఇంజనీరింగ్). నెట్/గేట్ అర్హత ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించకూడదు
ఫెలోషిప్: రూ.25,000 **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **చివరి తేదీ:** 2018 జనవరి 19
చిరునామా: The Director, Centre for Airborne Systems (CABS), DRDO, Ministry of Defence, Belur, Yemlur PO., Bengaluru - 560 037.
వెబ్‌సైట్: https://www.drdo.gov.in

టిఫర్ విఎస్‌ఆర్‌పి-2018

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టిఫర్) సమ్మర్ ప్రోగ్రాంలో రీసెర్చ్ కోసం దరఖాస్తులు కోరుతోంది.
ప్రోగ్రాం: విజిటింగ్ స్టూడెంట్స్ రీసెర్చ్ ప్రోగ్రాం
కాల వ్యవధి: 2018 మే 7 నుంచి జూలై 4 వరకు
స్టయిపెండ్: నెలకు రూ.7000
అర్హత: ఆయా కోర్సుల్లో ప్రస్తుతం చదువుతున్న డిగ్రీ లేదా పీజీ విద్యార్థులు
ఎంపిఎ: అకడమిక్ మెరిట్, రైటప్, రిఫరీ నివేదికల ఆధారంగా **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
చివరి తేదీ: 2018 ఫిబ్రవరి 28
వెబ్‌సైట్: http://www.tifr.res.in

ఎన్‌ఐపిజిఆర్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జీనోమ్ రీసెర్చ్ సీనియర్ రీసెర్చ్ ఫెలో భర్తీకి దరఖాస్తు కోరుతోంది.
సీనియర్ రీసెర్చ్ ఫెలో:01
అర్హత: ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్/బయో టెక్నాలజీ/ బయో ఇన్ఫర్మాటిక్స్/మాలిక్యూలర్ బయాలజీ)
అనుభవం:సంబంధిత విభాగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
చివరి తేదీ: 2018 జనవరి 12
చిరునామా: Dr. Swarup Kumar Parida, Scientist, NIPGR. Aruna Asraf Ali Mrag, P.O. Box No. 10531, New Delhi - 110067.
వెబ్‌సైట్: http://www.nipgr.res.in/careers


Describe Darwin's theory of evolution

